


పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ జగదీష్



దేహ దారుఢ్య పరీక్షలు నేటితో సమాప్తం

అనంతపురం క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య (పీఎంటీ, పీఈటీ) పరీక్షలకు వివిధ కారణాలతో గైర్హాజరైన, అప్పీలు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం అవకాశం ఇస్తున్నామని ఎస్పీ జగదీష్ తెలియజేశారు. జిల్లాలో గత నెల 30వతేదీ నుంచి జరుగుతున్న కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు ముగింపు దశకు వచ్చాయి. ఈ నెల 21వ తేదీ చివరి అవకాశం ఇస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఇప్పటి వరకు గైర్హాజరైన, అప్పీలు చేసుకున్న అభ్యర్థులు తప్పకుండా మంగళవారం రావాలని సూచించారు. దేహదారుఢ్య పరీక్షలు సోమవారం కొనసాగాయి. సీసీ కెమెరాల పర్యవేణలో పరీక్షలు నిర్వహించారు. ఎస్పీ దగ్గరుండి ఈ ప్రక్రియను గమనించారు. తెల్లవారుజాము నుంచి అభ్యర్థులకు సర్టిఫికెట్లు పరిశీలన, ఎత్తు, ఛాతి కొలతలు, 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహించారు.

పెరిగిన టీడీపీ కుటుంబం

ఉమ్మడి జిల్లా ఓటర్లలో

27.72 శాతం మందికి సభ్యత్వం

అత్యధికంగా శ్రీ సత్యసాయి జిల్లాలో 30.54 శాతం

అనంతలో 25.09 శాతం

లక్షకుపైగా సభ్యత్వాలతో టాప్‌లో కళ్యాణదుర్గం

ముగిసిన టీడీపీ సభ్యత్వ నమోదు

7

యంగ్ ఇండియా రూపకర్త కన్నుమూత

ఉపాధిహామీ హక్కుల ఉద్యమకారుడు నరేంద్రసింగ్ బేడీ మృతి

నేడు గుట్టూరులో అంత్యక్రియలు

7



నివాళులు అర్పిస్తున్న భార్య సోనియాబేడీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు



మాట్లాడుతున్న రాజీవ్ రంజన్ మిశ్రా, చిత్రంలో రెండు జిల్లాల కలెక్టర్లు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న

చెప్పండి.. వింటాం..!

ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయ సేకరణ

జిల్లాలో ఏకసభ్య కమిషన్ పర్యటన

కలెక్టరేట్‌లో ఎస్సీల వినతుల స్వీకరణ

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ జిల్లాలో సోమవారం పర్యటించింది. విశ్రాంత ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ ఉమ్మడి జిల్లాలోని ఎస్సీల అభిప్రాయాలను కలెక్టరేట్‌లో సేకరించింది. వర్గీకరణ అంశంపై మాలలు, మాదిగల సహా ఎస్సీ కుల సంఘాలు, నాయకులు, ప్రతినిధులు తమ అభిప్రాయాలను కమిషన్‌కు తెలియజేశారు. వినతిపత్రాలను సమర్పించారు. వర్గీకరణను వెంటనే అమలు చేయాలని మాదిగలు, వద్దని మాలలు విన్నవించారు. రజక, బేడ బుడగ తదితర కులాలవారు తమ సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు.

- వివరాలు 6లో...

రిజర్వేషన్ శాతాన్ని పెంచాలి

పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు కోరారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న, రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు రమణ, నాయకులు ఓబులేసు, ముత్యాలు, రామకృష్ణ, రామాంజిన తదితరులు ఏకసభ్య కమిషన్‌కు వినతి పత్రం ఇచ్చారు. ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. భూమి, ఉపాధి, వసతి కల్పించాలని కోరారు. కుల వివక్ష, అత్యాచారాలను నిర్మూలించాలని కోరారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం రూరల్



రాజీవ్ రంజాన్ మిశ్రాకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



వర్గీకరణ సరికాదంటూ వినతిపత్రం అందజేస్తున్న మాల సామాజికవర్గం ప్రతినిధులు

జనగణన తర్వాతే...

అనంతపురం సెంట్రల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేయవద్దని కోరుతూ మాలల సంక్షేమ ఐక్యవేదిక నాయకులు ఏక సభ్య కమిషన్‌కు వినతిపత్రం సమర్పించారు. డాక్టర్ కోట్ల గంగాధర్ నేతృత్వంలో 30 మాల సంఘాల ప్రతినిధులు కలెక్టరేట్‌లో ఏక సభ్య కమిషన్‌ను కలిశారు. 2025లో జనగణనను చేసి పార్లమెంటులో మూడింట రెండు వంతుల మెజార్టీతో ఆమోదించిన తర్వాత వర్గీకరణ చేస్తే స్వాగతిస్తామన్నారు. మాల సంఘాల ప్రతినిధులు శ్రీనివాసులు, ఓబులేసు, సుందరబాబు, ముత్యాలప్ప, శంకర్, రామన్న, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ జాబితాలో చేర్చండి

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వరన్ కోరారు. అస్సాం, త్రిపుర, నాగాలాండ్‌లో బీజేపీ ప్రభుత్వాలు రజకులను గడిచిన పదేళ్లలో ఎస్సీ జాబితాలో చేర్చాయని ఏకసభ్య కమిషన్‌కు వివరించారు. సీఎం చంద్రబాబు 2014లో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేలా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించారని అన్నారు. ఇదే అంశంపై 1985లో అప్పటి సీఎం ఎన్టీఆర్ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారని అన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేలా చూడాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం అర్బన్

సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు





ఏక సభ్య కమిషన్‌కు వినతి పత్రం అందజేస్తున్న బేడ, బుడగ సంక్షేమ సంఘం నాయకులు

ఎస్సీ సర్టిఫికెట్లు ఇప్పించండి

బేడ, బుడగ జంగాలకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని బేగ, బుడగ జంగాల సంక్షేమ సంఘం నాయకులు ఏకసభ్య కమిషన్‌కు విన్నవించారు. సిరిశాల రాంబాబు, నారాయణ, అంజి, మల్లి, కుళ్లాయప్ప, పెద్ద యల్లయ్య, సుంకన్న, జమ్మన్న, నాగేంద్ర, గిడ్డయ్య, దస్తగిరి, ఎర్రిస్వామి, నారాయణస్వామి తదితరులు వినతి పత్రం అందజేశారు. తమ జీవన స్థితిగతులు, ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని కోరారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం అర్బన్

ఉప్పరపల్లిలో పర్యటన



డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్‌ను పరిశీలిస్తున్న రాజీవ్ రంజన్ మిశ్రా, కలెక్టర్

అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లిలో ఏకసభ్య కమిషన్, విశ్రాంత ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా పర్యటించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌తో కలసి సోమవారం సాయంత్రం గ్రామంలోని ఎస్సీ రైతుల చీనీ తోటలు, గ్రామ సచివాలయం, రైతుసేవా కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు కాశప్ప, బాబయ్యతో మాట్లాడారు. ఏపీఎంఐపీ గురించి అడిగారు. డ్రిప్ సిస్టమ్‌ను పరిశీలించారు. చీనీ తోటలో అంతర పంటగా మెంతి కూరను పండించామని, తమ ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగుపడిందని రైతులు వివరించారు. అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, హార్టీకల్చర్ డీడీ నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, డ్వామా పీడీ సలీమ్ బాషా, హార్టికల్చర్ అధికారి రత్నకుమార్ పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం రూరల్

క్రైస్తవుల సంక్షేమానికి సీఎం పెద్దపీట

టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్



మాట్లాడుతున్న ఈటె స్వామిదాస్

అనంతపురం కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షు డు ఈటె స్వామిదాస్ పేర్కొన్నారు. రాయలసీమ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి స్వామిదాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. క్రైస్తవ సమాధుల తోట కోసం స్థలాలు సేకరించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించడం హర్షణీయమన్నారు. క్రిస్టియన్‌ను అని చెప్పుకునే జగన్మోహన్‌రెడ్డి చేయలేకపోయిన పనిని చంద్రబాబు నాయుడు చేశాడని కొనియాడారు. ఇటీవల చంద్రబాబునాయుడును కలిసిన సమయంలో క్రైస్తవులు, పాస్టర్ల సమస్యల పరిష్కారం కోసం మెమొరాండం ఇచ్చినట్లు వెల్లడించారు. అందులోని సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. బడ్జెట్‌లో క్రైస్తవుల సంక్షేమం కోసం రూ.150కోట్లు కేటాయించి క్రైస్తవుల పక్షపాతి అని నిరూపించుకున్నాడన్నారు. కార్యక్రమంలో పాస్టర్ల సంఘం అధ్యక్షుడు కృపాదాస్, ఉపాధ్యక్షుడు ఆంథోని, కార్యదర్శి డేనియల్, సలహాదారు రాజేష్‌కుమార్, సామ్యూల్, యాకోబ్ పాల్గొన్నారు.

వందేళ్ల తరువాత ఊరి దేవర



బొమ్మనహాళ్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గ్రామదేవత దేవమ్మ జాతరను వందేళ్ల తరువాత నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి దేవర ప్రారంభమవుతుందని చెప్పారు. రెండు రోజులపాటు సాగుతుందన్నారు.

పనులెట్లా జరిగేది..?

డ్వామాలో హైడ్రామా

పీడీ తప్ప అంతా ఇన్‌చార్జిలే

ఉపాధి సీజన్‌లో రెగ్యులర్ ఉద్యోగులేరీ?

పనులు, రోజుల పూర్తిపై సందేహాలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): డ్వామాలో ఇన్‌చార్జ్‌ల పాలన కొనసాగుతోంది. పీడీ పోస్టు తప్పా మిగిలిన అన్నింటికి ఇన్‌చార్జ్‌లే దిక్కుగా ఉన్నారు. అసలే ఉపాధి హామీ పనుల సీజన్ మొదలైంది. కూలీలలకు పనులు కల్పించాల్సిన కీలక సమయం ఇది. అయినా డ్వామాలో కీలక పోస్టులకు రెగ్యులర్ ఉద్యోగులు లేరు. ప్రభుత్వ శాఖల్లో కీలకంగా ఉన్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పట్ల ఉన్నతాధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. డ్వామా పరిధిలో ఉపాధి అదనపు పీడీతో పాటు ఆరు క్లస్టర్ ఏపీడీ పోస్టులు ఉంటాయి. వీటిని ఇన్‌చార్జిలతోనే కొనసాగిస్తున్నారు. ఇక ఏపీఓలు 32మండలాలకు 10 పోస్టుల్లో ఇన్‌చార్జిలే పనిచేస్తున్నారు. పీడీ కార్యాలయంలో ఉండాల్సిన ఉపాధి పథకం అదనపు పీడీ పోస్టు ఖాళీగా ఉండటంతో పాటు ఏఓ, ఫైనాన్స్ మేనేజర్, ఉపాధి సూపరింటెండెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైసీపీ పాలనలో హవా కొనసాగించిన విజిలెన్స్ అధికారి ఎట్టకేలకు బదిలీ అయినట్లు తెలిసింది. విజిలెన్స్ అధికారిగా తన పరపతితో కాసులు దోచేసిన ఆ అధికారికి కర్నూలు డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిసింది. రెండు మూడు రోజుల్లో ఆయన రిలీవై కర్నూలు డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆ పార్టీకి కొమ్ముకాసే అధికారులకే పట్టం కట్టిన యంత్రాంగం....తిరిగి అదే అధికారులకు పక్కజిల్లాల్లో కీలక పోస్టులు ఇస్తున్నారని పలువురు పెదవి విరుస్తున్నారు. ఇదివరకు డ్వామాలో ఏఓగా పనిచేసిన ఓ అధికారికి జిల్లాలోనే కీలక పోస్టును ఇచ్చారు. ఈ నేపథ్యంలో అప్పుడు వారిదే హవా ప్రభుత్వం మారినా వారి మాటే నడుస్తోందంటూ నిట్టూరుస్తున్నారు.

సీజన్ మొదలవుతున్న సమయంలో ...

రాబోయేది ఉపాధి పనులు ప్రారంభమయ్యే కీలక సమయం. ఈ సీజన్‌లో వీలైనన్ని ఎక్కువ పనిదినాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఏడాది మొత్తం ఒక ఎత్తైతే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలలు అత్యంత కీలకం. ఈ నాలుగు నెలల్లో కనీసం జిల్లాకు కేటాయించిన పనిదినాల్లో 75శాతం పూర్తి చేయాల్సి ఉంటుంది. అంతేగాక కూలీలకు పనులు కేటాయింపులు, పనిచేసే ప్రాంతాల గుర్తింపు, కొలతలు తీసుకోవడం వంటివి ఒకదానికొకటి ముడిపడి ఉంటుంది. ఇవన్నీ సక్రమంగా సాగాలంటే కచ్చితంగా అన్ని మండలాలకు ఏపీఓలు, అన్ని క్లస్టర్లకు ఏపీడీలు, డ్వామా పీడీ కార్యాలయంలోని కీలక పోస్టుల్లో రెగ్యులర్ అధికారులే ఉండాల్సిన పరిస్థితి. పనులు వేగంగా జరగడానికి రెగ్యులర్ అధికారులు కొన్ని వేగంగా నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆరు ఏపీడీ, ఏఓ, ఎఫ్ఎం పోస్టులన్నీ ఖాళీగా ఉంటే పనులు ఎలా వేగంగా సాగుతాయనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

అప్పుడు.. ఇప్పుడు వారిదే హవా..!

వైసీపీ పాలనలో అధికంగా అదనపు అధికారులు, సిబ్బంది ఉండేవారు. వైసీపీ ప్రజాప్రతినిధుల సిఫారసులతో అవసరం లేని సమయం, చోట కూడా పోస్టింగ్‌లు ఇచ్చారు. అయితే ప్రభుత్వం మారడంతో ప్రక్షాళన జరుగుతుందని అందరూ భావించారు. పీడీ తప్పా ఎవరూ డ్వామాలోకి కొత్త అధికారులు రాలేదు. ఉన్న అధికారులు వెళ్లిపోయారు. అప్పటి ప్రజాప్రతినిధులకు వత్తాసు పలికిన అధికారులు మాత్రం అదే పోస్టులోనే కొనసాగుతున్నారు. అప్పుడు ఇబ్బంది పడిన అధికారులు మాత్రం ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. వైసీపీ ఐదేళ్లలో డ్వామాలోని విజిలెన్స్, హెచ్‌ఆర్, వాటర్ షెడ్‌లలో కీలకంగా పనిచేసిన అధికారులు అదే పోస్టుల్లోనే కొనసాగుతున్నారు. ఒకే చోట ఐదేళ్లు పూర్తి అయినా వీళ్లకు బదిలీలు ఉండవా అని తోటి ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల ఇదే అంశంపై ఉద్యోగులంతా కలెక్టర్‌ను కలిసి రహస్యంగా విన్నవించినట్లు సమాచారం.

అంతా ఇన్‌చార్జిలతోనే..

డ్వామాలో కీలక పోస్టులను ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. డ్వామాలో కీలకంగా ఉన్న ఏఓ పోస్టులో అప్పటి వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన విజయలక్ష్మి గుంతకల్లు డీఎల్‌డీఓగా బదిలీ అయ్యారు. దీంతో వాటర్‌షెడ్ అడిషినల్ ఏపీడీ సుధాకర్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఫైనాన్స్ మేనేజర్‌గా ఉన్న వెంకటనాయుడు ప్రకాశం జిల్లా డీపీఓగా బదిలీపై వెళ్లడంతో ఇప్పటికే అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న విజిలెన్స్ అధికారి రమణారెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు కట్టబెట్టారు. అయితే రమణారెడ్డి కూడా కర్నూలు డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా బదిలీ అయినట్లు సమాచారం. రెండు మూడు రోజుల్లో ఆయన రిలీవై వెళ్లిపోతే ఓ వైపు విజిలెన్స్ అధికారి, ఎఫ్ఎం పోస్టులు రెండూ ఖాళీ అవుతాయి. రాయదుర్గం క్లస్టర్ ఏపీడీగా ఉన్న జయకుమార్ తన మాతృశాఖ హార్టికల్చర్‌కు వెళ్లడంతో సీబీ ఏపీడీ అయేషాను ఇన్‌చార్జిగా నియమించారు. ఉరవకొండ ఏపీడీ గుంతకల్లు డీఎల్‌డీఓగా బదిలీ కావడంతో పీడీ కార్యాలయంలో ఉపాధి పథకం సూపరింటెండెంట్‌గా ఉన్న శైలజకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం శైలజ సర్వశిక్ష అభియాన్‌కు పీడీగా వెళ్లడంతో ఆ స్థానంలో ఎవరికి బాధ్యతలు అప్పగించాలో అర్థం కాక అధికారులు సతమతమవుతున్నారు. తాడిపత్రి ఏపీడీ వెంకటరత్నం అన్నమయ్య జిల్లా డ్వామా పీడీగా బదిలీ చేయడంతో గుత్తి ఇన్‌చార్జి పీడీగా ఉన్న విజయ్‌కుమార్‌కు ఇక్కడ అదనపు బాధ్యతలు కట్టబెట్టారు. ఇక అనంతపురం క్లస్టర్ ఏపీడీగా ఉన్న అనురాధ ఉద్యోగ విరమణ సమయం దగ్గర పడడంతో తన మాతృశాఖకు వెళ్లిపోయారు. ఈ స్థానంలో ఏపీఓ చెన్నకేశవయ్యను ఇన్‌చార్జిగా నియమించారు. కళ్యాణదుర్గం ఏపీడీ కూడా దీర్ఘకాలిక సెలవులో వెళ్లినట్లు సమాచారం. దీంతో ఆ పోస్టు కూడా ఖాళీ అయినట్లే.



డ్వామా కార్యాలయం

ఏపీడీల నియామకం అవసరం



ఉపాధి పనులు వేగంగా జరిగే సమయం ఇది. ఇందులో క్లస్టర్ ఏపీడీలు, మండల ఏపీఓలది కీలక పాత్ర. సీజన్‌కు అన్ని పోస్టుల్లోనూ రెగ్యులర్ అధికారులు ఉండాలని జిల్లా కలెక్టర్‌ను కోరాం. ఆ మేరకు ప్రతిపాదనలు పంపాం. డ్వామాలో పోస్టులు ఖాళీగా ఉన్న మాట వాస్తవమే. ప్రభుత్వం ఇంకా ఏపీడీలను జిల్లాకు కేటాయించలేదు. ఇప్పటికే పలుమార్లు డ్వామాలో పరిస్థితిని వివరించాం. అన్ని క్లస్టర్లకు ఏపీడీలను నియమించాలని సీఆర్‌డీ అధికారులకు రాతపూర్వకంగా ప్రతిపాదనలు పంపాం. అయితే అక్కడ నుంచి స్పందన రావాల్సి ఉంది.

- సలీంబాషా, డ్వామా పీడీ

వడ్డెర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా దేవళ్ల మురళి



దేవళ్ల మురళిని సన్మానిస్తున్న కుంచెపు వెంకటేష్ తదితరులు

అనంతపురం అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వడ్డెర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి ఎంపికయ్యారు. శ్రీశైలంలోని వడ్డెర్ల సంఘం కార్యాలయంలో సోమవారం రాష్ట్ర స్థాయి వడ్డెర్ల సంఘాల నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన దేవళ్ల మురళిని రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వడ్డెర్ల సంఘం అనంత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్, నాయకులు సుధాకర్, మంజునాథ్, వెంకట రాముడు, లక్ష్మన్న, అంజినప్ప తదితరులు దేవళ్ల మురళికి పూల మాలలు వేసి సన్మానిం చారు. సంఘం పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భం గా దేవళ్ల మురళి మాట్లాడుతూ... వడ్డెర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చొరవ చూపుతానని పేర్కొన్నారు.

మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీకి మార్గదర్శకాలు జారీ

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల తరహాలో మేనేజ్‌మెంట్ కోటా(కేటగిరి-బి) సీట్లను భర్తీ చేయాలని స్పష్టత ఇచ్చింది. అగ్రికల్చర్ బీఎస్సీ(ఆనర్స్)లో కేటగిరి బీ కింద మిగిలిపోయిన సీట్లను మొదట ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన వారితో భర్తీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇంటర్మీడియట్ బైపీసీలో 45%పైగా మార్కులు వచ్చిన ఓసీలకు, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 40%పైన మార్కులు వచ్చిన వారికి అవకాశం కల్పించాలని, ఇంకా ఖాళీలు ఉంటే మార్కుల శాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది.

రెండో విడత ఎన్నికలు

అనంతపురం అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండో విడతలో 28 ప్రాథమిక గొర్రెల పెంపక సహకార సంఘాలకు పాలక వర్గం ఎన్నికలు జరిగాయి. రెండో విడతలో 36 సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నింది. సరైన రికార్డులు లేని కారణంగా ఆరు సంఘాలను ఎన్నికలు నిర్వహించలేదు. ఆత్మకూరు మండలం కుర్లపల్లి, గుమ్మఘట్ట మండలం గోళ్లపల్లి సంఘాలకు వెటర్నరీ డాక్టర్లు సెలవులో ఉండటంతో ఎన్నికలు నిర్వహించలేదు. ఈ రెండు సంఘాలకు ఈ నెల 22న ఎన్నికలు నిర్వహించాలని పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. మూడో విడతలో ఈ నెల 25వ తేదీన 35 సంఘాలకు, నాలుగో విడతలో ఫిబ్రవరి 2వ తేదీన 14 సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారు.

పేదింటి దొడ్డ గుణం

వైద్య కళాశాలకు భర్త మృతదేహాన్ని అప్పగించిన భార్య



భర్త మృతదేహాన్ని వైద్య కళాశాలకు అప్పగిస్తున్న లక్ష్మి

అనంతపురం టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): దానం చేసే మనసుకు పేదరికం అడ్డుకాదని, దొడ్డ గుణాన్ని చాటుకుంది ఓ మహిళ. భర్తను పోగొట్టుకుని పుట్టెడు దుఃఖంలో ఉన్నా సమాజహితం కోసం పరితపించింది. ఆమె రూరల్ మండలం ప్రభాకర్‌చౌదరి కాలనీకి చెందిన లక్ష్మి. చదువు సంధ్యలు, పిల్లలు లేని ఆమె భర్త శంకర్‌రెడ్డి(60)తో కలిసి బేల్దారి పనులకు వెళ్లేది. భార్యభర్తలు ఒకరికొకరు తోడుగా జీవన పయనం సాగిస్తున్న సమయంలో తీవ్రమైన కడుపునొప్పితో ఈ నెల 8న శంకర్‌రెడ్డి జిల్లా సర్వజన ఆస్పత్రిలో చేరాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని ప్రభాకర్‌చౌదరి కాలనీకి తరలించారు. అంత్యక్రియల కోసం పలువురిని ఆమె సాయం అర్థించింది. ఈక్రమంలోనే సాయిట్రస్టు అధ్యక్షుడు విజయసాయి అక్కడికి వెళ్లి మృతదేహాన్ని వైద్య కళాశాలకు దానం చేస్తే వైద్య విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని మృతుడి భార్య లక్ష్మికి వివరించాడు. ఆమె పెద్దమనసుతో అందుకు అంగీకరించి, కళాశాల వరకు వచ్చి మృతదేహాన్ని అప్పగించారు. ఆమెను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాలరావు అభినందించారు.

మా బతుకులు మార్చండి

మెడికల్ పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు



ర్యాలీ నిర్వహిస్తున్న మెడికల్ పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీలు

అనంతపురం టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): 'అనేక సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నాం. అయినా ప్రతినెలా జీతాలు ఇవ్వరు. ఉద్యోగ భద్రతలేదు. ఎన్నిప్రభుత్వాలు మారినా మా బతుకులు మారడం లేదు. ఇప్పుడైనా మార్చండి' అంటూ మెడికల్ పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వైద్య కళాశాల పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు పెద్దఎత్తున జిల్లాకేంద్రంలో ఆందోళన చేపట్టారు. తొలుత జిల్లా ఆస్పత్రి నుంచి అనంతపురం ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి అక్కడ ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌కు తరలివచ్చి జేసీ శివనారాయణ శర్మను కలిసి, వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఆకుటుంబాలు ఎలా బతకాలని మడిపడ్డారు. ఈపీఎఫ్, ఈఎస్‌ఐలు కూడా చెల్లించకుండా మోసం చేస్తున్నారన్నారు. జీతాలు ఇవ్వకుండా కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్న సంబంధిత ఏజెన్సీపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడు, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, నాయకులు మనోహర్, చిరంజీవి, నల్లమ్మ ప్రశాంత్, భార్గవి, శోభారాణి, హమీదవన్నూర్, స్వరూప, నారప్ప పాల్గొన్నారు.

30న జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న నిర్వహించనున్నారు. జడ్పీలోని ప్రధాన సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని జడ్పీ చైర్మన్, మంత్రులు, జడ్పీ వైస్ చైర్మన్లు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర కార్పొరేషన్ల చైర్మన్లు, అన్ని శాఖల అధికారులకు సమాచారం అందించారు.

చెప్పండి.. వింటాం..!

- ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయ సేకరణ
- జిల్లాలో ఏకసభ్య కమిషన్ పర్యటన
- కలెక్టరేట్‌లో ఎస్సీల వినతుల స్వీకరణ
- సుప్రీం తీర్పును వెంటనే అమలు చేయాలి
- మాదిగ సామాజికవర్గం వినతి
- వర్గీకరణ రాజకీయ ప్రేరేపితం
- మాల సామాజికవర్గం అభ్యంతరం

అనంతపురం టౌన్/సెంట్రల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉప కులాల వర్గీకరణ అంశంపై ఆయా సామాజికవర్గాల ప్రజలు, సంఘాల నాయకుల అభిప్రాయాలను సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ జిల్లాలో పర్యటించింది. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఏకసభ్య కమిషన్, విశ్రాంత ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా సోమవారం అభిప్రాయాలను తెలుసుకుని, వినతి పత్రాలను స్వీకరించింది. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఎస్సీ ఉప కులాల సంఘాల నాయకులు, కులాల ప్రతినిధులు తరలివచ్చారు. రాజీవ్ రంజన్ మిశ్రాతోపాటు అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ తదితరులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ వినతి పత్రాలను సమర్పించారు. వినతిపత్రాలు ఇచ్చేందుకు వచ్చినవారికి అధికారులు అనేక ప్రశ్నలు వేస్తూ, వారి అభిప్రాయాలను రికార్డు చేసుకున్నారు.



మాట్లాడుతున్న రాజీవ్ రంజన్ మిశ్రా, చిత్రంలో రెండు జిల్లాల కలెక్టర్లు, అధికారులు

అక్షరాస్యులు 2.90 లక్షల మంది

ఉమ్మడి జిల్లా జనాభాలో ఎస్సీలు 14.29 శాతం ఉన్నారు. వీరిలో 2.90 లక్షలమంది మాత్రమే చదువుకున్నారు. మిగిలిన వారు నిరక్షరాసులు. 2014-2025 మధ్య పదో పదవ తరగతి వరకూ చదువుకున్న విద్యార్థుల్లో మాదిగలు 1,44,006 మంది, మాల, మాల అయ్యావారు 20,473 మంది, ఆది ఆంధ్ర 445 మంది ఉన్నారు. చమర్, మౌచి, ముచ్చి 139 మంది, మాల దాసరి 1688, హోలియా దాసరి ఒకరు ఉన్నారు. డామ్, డొమ్మర, ఘైడి, పానో ఐదుగురు, అరయ్‌మాల 231 మంది, అర్వమాల ఒకరు ఉన్నారు. బరికి ఐదుగురు, ఆది ద్రావిడ 15, జగ్గలి ఐదుగురు, చాలవాడి 18, ముండాల ఒకరు, డక్కల్, డొక్కల్‌వార్ 45 మంది, మాదిగ దాసు, మస్టి ఇద్దరు, మహర్ ఒకరు, మలసాలి, నెట్కానివారిలో ఇద్దరు చదువుకున్నారు. పాకీ, మోటి, తోటి, వల్లువాన్ కులాల్లో ఒక్కరు కూడా పదోతరగతి చదివిన వారు లేరు. ఇంటర్మీడియేట్ 92,096 మంది, పాలిటెక్నిక్, ఐటీఐ 16,759 మంది, డిగ్రీ 1,02,720 మంది, ఇంజనీరింగ్, ఫార్మసీ, ట్రిపుల్ ఐటీ 27,019 మంది విద్యార్థులు అడ్మిషనన్ అయ్యారు.

ఉమ్మడి జిల్లాలో ఎస్సీలు

కులాలు 49
జనాభా 5.83 లక్షలు
పురుషులు 2.92 లక్షలు
స్త్రీలు 2.90 లక్షలు
అక్షరాస్యులు 2.90 లక్షలు
ఉద్యోగులు 48,080

ఇదీ జనాభా

ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ జనాభాలో కులాలవారీగా మాదిగలు 4,75,632 మంది, మాలలు 73,525 మంది ఉన్నారు. ఆది ఆంధ్రా 5,802 మంది, మాదాసి కురువ 786 మంది, చమర్, మౌచి, ముచ్చి 741, మంది, మాలదాసరి 430 మంది, హోలియ దాసరి 409 మంది, డామ్, డొమ్మర, పానో 342 మంది, అరయ్ మాల 285, అర్వమాల 283 మంది ఉన్నారు. బరికి 197, ఆది ద్రావిడ 189, జగ్గలి 121, చాలవాడి 83, ముండాల 81, వలువాన్ 64, డక్కల్, డొక్కల్‌వార్ 61 మంది ఉన్నారు. పాకి, మోటి, తోటి 54 మంది, దోర్ 48, యల్లమలవార్ 43, మాదిదాసు, మస్టీన్ 39, మస్నీ 31, గోసంగి 25, జాంబువులు 24 మంది ఉన్నారు. హోలయ 18, మాలసన్యాసి 13, చచాటి 12, మహర్ 11, మాలసాలి, నెట్కాని 11, మాలజంగం 9 మంది ఉన్నారు. అరుంధతీయ 6, చంబర్ 6, దందాసి 5, మస్టీ 5, మటంగి 5, బయగారా, బయగారి 4, మాలదాసు 4, గాసి, హడ్డి 3, పామిడి 3, సిందోళ్లు, చిందోళ్లు 3, యటల 3, అనాముక్ 2, బైండ్ల 2, మాంగ్ 2, మెహ్తార్ ఇద్దరు ఉన్నారు. మాలహనయ్, మాలమస్టీ, సాంగారా, సంబన్ ఒక్కొక్కరు ఉన్నారు.

స్పష్టమైన సమాచారం ఇవ్వండి: కమిషన్

ఉమ్మడి అనంతపురం జిల్లా సమగ్ర సమాచారాన్ని స్పష్టంగా ఇవ్వాలని ఏకసభ్య కమిషన్ విశ్రాంత ఐఏఎస్ రాజీవ్‌రంజిత్ మిశ్రా ఉమ్మడి అనంతపురం జిల్లా అధికారులను ఆదేశించారు. అభిప్రాయ సేకరణ ముగిసిన తరువాత ఆయన కలెక్టర్లు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో ఎస్సీ సామాజికవర్గ ఉద్యోగుల వివరాలు, విద్యార్థుల వివరాలు, గ్రూప్1, 2 గ్రూప్ 3, 4 అధికారులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు, సంక్షేమ పథకాలు(జనాభా నిష్పత్తిలో) తదితర వివరాలను ఆయన కోరారు. ఇప్పటికే తయారు చేసిన నివేదికను రెండు జిల్లాల కలెక్టర్లు కమిషన్‌కు అందజేశారు.



సమస్యలను నోట్ చేసుకుంటున్న రాజీవ్‌రంజన్‌మిశ్రా

వెంటనే అమలు చేయండి

ఎన్నో ఏళ్లుగా వర్గీకరణ కోసం ఎదురు చూస్తున్నామని, సుప్రీం కోర్టు తీర్పును వెంటనే అమలుచేసి తమకు న్యాయం చేయాలని మాదిగ సంఘాల నాయకులు, ఆ సామాజికవర్గ ప్రజలు కోరారు. మాదిగల చరిత్రను ఏక సభ్య కమిషన్‌కు వివరించారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు కోరారు.



వర్గీకరణతోనే న్యాయం అంటూ మోకాళ్లపై కూర్చొని వేడుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మాకూ న్యాయం చేయండి..

తాము ఎస్సీ జాబితాలో ఉన్నామో లేదో తెలియడం లేదని బుడగ జంగాల సామాజికవర్గం వారు కమిషన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్‌పై స్పష్టతలేక తమ పిల్లలు చదవలేకపోతున్నారని, తమకు న్యాయం చేయాలని విన్నవించారు. తమకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీ అయ్యేలా చూడాలని కోరారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆ సామాజికవర్గం నాయకులు ఏకసభ్య కమిషన్‌కు విన్నవించారు.



కంటతడిపెట్టి చెబుతున్న బుడగజంగాల నాయకుడు

ఇవీ గణాంకాలు

ఏకసభ్య కమిషన్‌కు ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఎస్సీల గణాంకాలతో పూర్తిస్థాయి నివేదికను అందజేశారు. నివేదికలో కులాలు, కులాలవారీగా జనాభా, స్త్రీ, పురుషులు, ఉద్యోగులు, అక్షరాశ్యులు, నిరక్షరాశ్యుల తదితర అంశాలను పొందుపరిచారు. 2011 గణాంకాల ప్రకారం ఉమ్మడి జిల్లా జనాభా 40.81 లక్షలు. ఇందులో ఎస్సీలు 5.83 లక్షల మంది. వీరిలో పురుషులు 2.92 లక్షల మంది, స్త్రీలు 2.90 లక్షల మంది ఉన్నారు. ఎస్సీ విభాగంలో 49 కులాలు ఉన్నాయి. ఇందులో మాదిగ, మాల జనాభా అత్యధికంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో 48,080 మంది ఎస్సీలు ప్రభుత్వ శాఖల్లో 2014-24 మధ్య ఉద్యోగాలు పొందారు.

48,080 మంది ఉద్యోగులు

ఉమ్మడి జిల్లాలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన 48,080 మంది వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్నారు. 2014-24 మధ్య కులాల వారిగా గ్రూప్1, 2, 3, 4 కేడర్లలోనూ, క్లాస్-4, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో వీరు ఉద్యోగాలు పొందినట్లు నివేదికలో పేర్కొన్నారు. కులాలవారిగా మాదిగలు 31,884 మంది, మాలలు 14,298 మంది, ఇతరులు 1,898 మంది ఉద్యోగాలలో ఉన్నారు. నివేదికలో వరుస సంఖ్య 29, 41లో టెక్నికల్ ఎడ్యుకేషన్ పాలిటెక్నిక్ కళాశాలలు, 14, 34 వరుస సంఖ్యలో సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌ను రెండు సార్లు చూపించింది.

వర్గీకరణ వద్దు..



మాట్లాడుతున్న మాలలు

వర్గీకరణ అన్యాయమని, రాజకీయ ప్రయోజనాల కోసం ఎస్సీల మధ్య చిచ్చు పెడుతున్నారని మాల సామాజికవర్గం నాయకులు, ఆ కుల సంఘాల నాయకులు కమిషన్‌తో అన్నారు. రిజర్వేషన్‌లు పెంచి ఎస్సీ కులాలకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రాలను సమర్పించారు.

పాడి పడకుండా..!

- పాడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం
- సబ్సిడీపై మినీ గోకులాల మంజూరు
- నామమాత్రంగా రైతు వాటా



సంజీవపురంలో నిర్మించిన మినీగోకులం షెడ్డు

గార్లదిన్నె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు, గొర్రెలు, మేకల కాపరులకు రాయితీతో ప్రభుత్వం మంజూరు చేసిన మినీ గోకులం షెడ్లు వరంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులు, గొర్రెలు, మేకలు పెంపకదార్లు తడకలు, కట్టెలతో చిన్న చిన్న పాకలు నిర్మించుకుని అందులో జీవాలను ఉంచేవారు. దీంతో కొన్ని జీవాలు వానాకాలంలో వర్షానికి తడుస్తూ, చలికి వణుకుతూ రోగాల బారినపడి మృతి చెందేవి. పాడి రైతులు రూ.లక్షల్లో నష్టపోతుండేవారు. ఈనేపథ్యంలో పాడి రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడంతో పాటు పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈక్రమంలోనే రాయితీతో మినీ గోకులం షెడ్లు మంజూరు చేసింది. ఐదెకరాలలోపు భూమి ఉన్న చిన్న సన్నకారు రైతులకు ఈ అవకాశం కల్పించింది.

షెడ్డును బట్టి నిధులు

రెండు పశువుల షెడ్డు నిర్మాణానికి రూ.1.15 లక్షలు కేటాయించారు. ఇందులో ఉపాధి నిధులు రూ. 103500, రైతు వాటా రూ. 11500లుగా నిర్ణయించారు. నాలుగు పశువుల షెడ్డు యూనిట్‌కు రూ. 1.85లక్షలుగా నిర్ణయించారు. ఇందులో ఉపాధి నిధులు రూ. 166500, రైతు రూ. 18500 చెల్లించాలి. ఆరు పశువుల షెడ్డు యూనిట్‌ను రూ.2.3 లక్షలుగా నిర్ణయించారు. ఉపాధి నిధులు రూ.207000, రైతు వాటా రూ. 23వేలు గా నిర్ణయించారు. 20 గొర్రెలు, మేకలు షెడ్డు యూనిట్‌కు రూ.1.3లక్షలు నిర్ణయించారు. ఇందులో ఉపాధి నిధులు రూ.91వేలు, రైతు వాటా రూ. 39వేలుగా ప్రకటించారు. 50 గొర్రెల యూనిట్ రూ.2.3లక్షలు, ఉపాధి నిధులు రూ.1.6లక్షలు, రైతువాట రూ. 69వేలుగా నిర్ణయించారు. 100 కోళ్ల షెడ్ రూ. 87వేలు, ఉపాధి నిధులు రూ. 60900, రైతువాటా రూ. 26వేలు, 200 కోళ్లషెడ్డుకు రూ. 1.32లక్షలు, ఉపాధినిధులు రూ. 92400, రైతు వాటా రూ. 39600 ఇలా యూనిట్‌లను ప్రభుత్వం మంజూరు చేసింది. పశువుల షెడ్ నిర్మాణాలకే రైతులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మండలంలో వందకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి మండలానికి సుమారు 46 మినీ గోకులం షెడ్లు రాగా, ఇప్పటి వరకు దాదాపు 26 షెడ్ల నిర్మాణాలు పూర్తి అయినట్లు తెలిపారు. మిగిలిన షెడ్లు వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం.

పశువులు సురక్షితం



మినీగోకులం షెడ్లలో పశువులు సురక్షితంగా ఉంటాయి. గతంలో షెడ్డు నిర్మించుకునేందుకు ఆర్థిక స్తోమత లేక టెంకాయ పట్టలతో కొట్టం వేసుకున్నాం. ఎండకు, వానకు తడిసి పశువులు అనారోగ్యానికి గురవుతుండేవి. గతంలో మా ఆవు మృతి చెందడంతో సుమారు రూ.40వేలు నష్టపోయాం. ప్రస్తుతం ఐదు ఎనుములున్నాయి. ప్రభుత్వం సబ్సిడితో ప్రవేశపెట్టిన మినీగోకులం షెడ్లు పాడిరైతులకు వరం.

- నర్రిశెట్టి స్వాతి, మహిళా రైతు, సంజీవపురం

పాడి రైతులకు వరం



మండలంలో చిన్న, సన్నకారు రైతులు అధిక సంఖ్యలో పాడిపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. సొంతంగా షెడ్లు నిర్మించుకోవాలంటే సుమారు రూ. రెండు లక్షలకు పైగా ఖర్చు అవుతుంది. ప్రస్తుతం మాకు 5 ఎనుములు, ఒక ఆవు ఉంది. వీటికి సొంతంగా షెడ్డు నిర్మించాలంటే దా దాపు రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఈ క్రమంలో పాడిరైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం మినీగోకులం షెడ్లు మంజూరు చేసి చేయూతనందిస్తోంది.

- బుల్లే రామకృష్ణ, గార్లదిన్నె

వేగంగా షెడ్ల నిర్మాణం

మినీ గోకులం షెడ్లు నిర్మించుకునేందుకు పాడి రైతులు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నా రు. మండలానికి 46 ఉండగా 100కు పైగా దరఖాస్తులు వచ్చాయి. షెడ్లు మంజూరైన రైతులందరు నిర్మాణాలు వేగవంతం చేసుకుంటున్నారు. మొదటి విడతలో రాని రైతులకు రెండో విడతలో వస్తాయి. మినీగోకులం షెడ్లు నిర్మాణాలు పూర్తి అయిన వాటికి బిల్లులు కూడా మంజూరవుతున్నాయి.

- యోగానందరెడ్డి, ఎంపీడీఓ

రంజీ జట్టులో వినయ్‌కు చోటు



అనంతపురం క్లాక్ టవర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా రంజీ జట్టుకు జిల్లాకు చెందిన వినయ్‌కుమార్ ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన విజయహజారే ట్రోఫీ, సయ్యద్‌ముస్తాక్ అలీ ట్రోఫీలలో మెరుగైన ప్రతిభ చాటిన వినయ్‌కుమార్‌కు ఆంధ్రా రంజీ జట్టులో చోటు కల్పించారు. రంజీ జట్టులో చోటు సాధించిన వినయ్‌కుమార్‌కు జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

నవోదయ హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

లేపాక్షి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ పాఠశాల 9వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 2025-26 సంవత్సరానికి 1084మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. ఫిబ్రవరి 8న జవహర్ నవోదయ విద్యాలయం లేపాక్షి, ఏపీఆర్‌జేసీ స్కూల్‌నందు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అదే విధంగా 11వ తరగతిలో ప్రవేశం పొందేందుకు 1228 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వీరికి ఫిబ్రవరి 8న హిందూపురంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. హాల్‌టిక్కెట్ల కోసం వెబ్‌సైట్‌నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

క్రైం కార్నర్

పగలే చోరీ

● 47 తులాల బంగారం, రూ.లక్ష నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

పెనుకొండ టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణమ్మ కాలనీ సమీపంలో సోమవారం పట్టపగలే ఇంట్లో దొంగలు పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగార్జున, జ్యోతిలత దంపతులు ఉపాధ్యాయులు. నాగార్జున పెనుకొండ మండలం గుట్టూరు హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. జ్యోతిలత బాలికల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఇరువురు సోమవారం విధులకు వెళ్లారు. దీనిని అదునుగా భావించిన దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. నగలు, నగదు అపహరించారు. సాయంత్రం తిరిగొచ్చిన ఉపాధ్యాయ దంపతులు చూసేసరికి ఇంట్లో బీరువా తెరిచి ఉంది. అందులోని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. చోరీ అయినట్లు గ్రహించారు. 47 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు చోరీ అయినట్లు బాధితులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మతిస్థిమితంలేని మహిళ అదృశ్యం

అనంతపురం క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైంది. నగరంలోని అశోక్‌నగర్‌లో నివాసముంటున్న ఉషారాణి అనే మహిళ కు చిన్నప్పటి నుంచి మతిస్థిమితం ఉండేది కాదు. అప్పుడప్పుడు ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయి మళ్లీ తిరిగి వచ్చేది. ఈ క్రమంలో ఈనెల 15న రాత్రి 8గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

అనంతపురం క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. వినాయక్‌నగర్‌లో చాకలి శ్రీనివాసులు, యాస్మిన్ (27) దంపతులు నివాసముంటు న్నారు. వీరు 10ఏళ్ల కిందట ప్రేమవివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులున్నారు. ఇంటి ఆర్థిక పరిస్థితుల్లో మార్పు రావడం, అప్పులెక్కువ కావడంతో ఈనెల 10న యాస్మిన్ కురులకు వాడే ద్రావకాన్ని తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రిలో అనుమానాస్పద మృతి

అనంతపురం క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది ఒకరు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన చాకలి అనిల్(28) నగరంలోని సాయినగర్ 2వ క్రాస్‌లోని మాక్‌నస్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అతడి డ్యూటీ ఉదయం 9 నుంచి రాత్రి 9గంటల వరకు ఉంటుంది. ఆదివారం మధ్యాహ్నం ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్లాడు. ఏం జరిగిందో తెలియదు. సోమవారం ఉదయం స్వీపర్ ఆ గదిలోకి వెళ్లే సరికి కుర్చీలో కూర్చుని కనిపించాడు. నిద్రపోతున్నట్లు భావించి ఆమె పిలిచింది. పలకకపోయే సరికి భయపడి సిబ్బందికి తెలియజేసింది. ఆసుపత్రి డాక్టర్ హర్షవర్ధన్ పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. టూటౌన్ సీఐ శ్రీకాంత్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుండెపోటుతో మృతి చెందాడా..? ఏదైనా విషద్రావకం సేవించాడా..? అనేది తెలియాల్సి ఉంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య భారతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మద్యం పట్టివేత

హిందూపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కొడికొండ-శిర జాతీయ రహదారిలోని కొల్లకుంట ఫ్లైఓవర్ వద్ద హర్యానా మద్యాన్ని ఎక్సైజ్ సీఐ రామ్మోహన్ సోమవారం తెలిపారు. సుబ్బిరెడ్డిపల్లికి చెందిన శ్రీనాథ్, ముద్దిరెడ్డిపల్లికి చెందిన బాలేంద్ర, నవీన్ కారులో హరియాణా రాష్ట్రానికి చెందిన సుమారు 90 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పట్టుకుని, వాహనాన్ని సీజ్ చేశామన్నారు. నిందితులను అరెస్టు చేశామన్నారు. పట్టుబడి మద్యం విలువ సుమారు రూ.3లక్షలు ఉంటుందన్నారు. దాడుల్లో ఈఎస్ గోవిందనాయక్, ఏఈఎస్ నరసింహులు, స్థానిక ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

యంగ్ ఇండియా రూపకర్త..

కన్నుమూత

● ఉపాధిహామీ హక్కుల ఉద్యమకారుడు నరేంద్రసింగ్ బేడీ మృతి

● వయోభారంతో తుదిశ్వాస



నరేంద్రసింగ్ బేడీ (ఫైల్)

హిందూపురం/పెనుకొం/తనకల్లు/చెన్నేకొత్తపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కరువుకు నిలయమైన ఉమ్మడి అనంతపురం జిల్లాను అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టిన యంగ్ ఇండియా ప్రాజెక్ట్ రూపకర్త నరేంద్రసింగ్ బేడీ (87) ఇకలేరు. వయోభారంతో పెనుకొండ మండలం గుట్టూరు సమీపంలోని ఫాంహౌస్‌లో ఆయన సోమవారం ఉదయం కన్నుమూశారు. అనంతపురం జిల్లాలో పేదరిక నిర్మూలన, సుస్థిరత, మానవహక్కులు, గ్రామీణ జీవన ప్రమాణాల పెంపు, విద్య, వైద్యం, నీటి నిలువలు, ఇంకుడు గుంతలు, వలసల నివారణకు గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలు చేయాలని ఆయన అలుపెరగని పోరాటం చేశారు. పంజాబ్‌లో జన్మించిన ఆయన 55ఏళ్ల క్రితం పెనుకొండ సమీపంలోని గుట్టూరులో యంగ్ ఇండియా ప్రాజెక్ట్ పేరిట స్వచ్ఛంద సంస్థను నెలకొల్పారు. గ్రామీణ ప్రాంత పేద ప్రజలు, రైతుల జీవనోపాధి కోసం అనేక కార్యక్రమాలను చేపట్టారు. ఉపాధి కల్పించారు. గ్రామాల్లో బావులు తవ్వించి, కూలీలకు ఉపాధి కల్పించడంతోపాటు రైతుల జీవనోపాధి కోసం సంస్థ కృషిచేస్తూ వచ్చింది. ఇంధన పొదుపు, సంప్రదాయేతర ఇంధన వనరుల పెంపకం, సేంద్రీయ, సుస్థిర వ్యవసాయం, ఉపాధి కల్పన, జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా అభివృద్ధి వైపు ఉత్తమ పౌర సమాజమే లక్ష్యంగా యంగ్ ఇండియా ప్రాజెక్ట్ పనిచేసింది. ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టడంలో బేడీది కీలకపాత్ర. వ్యవసాయ కూలీల యూనియన్లను ఏర్పాటుచేసి, వాటి ద్వారా ఎన్నో ఉద్యమాలు చేసి నిరుపేదలకు లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూమిని పంచడమేకాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రావాల్సిన సంక్షేమ పథకాలు అందేలా చేశారు. అనేక కార్యక్రమాల ద్వారా పేద ప్రజలను చైతన్యపరిచారు. దివ్యాంగులకు ప్రత్యేక నిధులను సమకూర్చి, వారికి కావాల్సిన పరికరాలను ఉచితంగా పంపిణీ చేశారు. మహిళా సంఘాలను ఏర్పాటుచేసి, ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యవంతులను చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలను పోటీ చేయించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతోపాటు రాయలసీమ వ్యాప్తంగా సేవలను కొనసాగించిన ఘనత యంగ్ ఇండియా ప్రాజెక్టుకే దక్కుతుంది. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) రాష్ట్రంలో అమలవుతోందంటే అందుకు యంగ్ ఇండియా ప్రాజెక్ట్ రూపకర్త నరేంద్రసింగ్ బేడీయే కారణమనడం అతిశయోక్తి కాదు. యంగ్ ఇండియా ప్రాజెక్ట్‌లో పనిచేసిన అనేక మంది నేడు సొంతంగా స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసుకుని, ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.



బేడీ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న భార్య సోనియాబేడీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు

నేపథ్యం..

నరేంద్రసింగ్ బేడీ పంజాబ్‌లో జన్మించారు. బెంగాల్‌లోని డూన్ పాఠశాలలో చదివారు. అమెరికాలో కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఆయనకు భార్య సోనియా బేడీ, ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. మణిశంకర్ అయ్యర్, దిగ్విజయ్ సింగ్, ఎంఎస్ స్వామినాథన్.. ఆయన సమకాలికులు. భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ.. బేడీకి కళాశాలలో మూడేళ్ల జూనియర్. జాతీయ ఉపాధిహామీ చట్టం రూపకల్పనకు ప్రముఖ ఆర్థికవేత్త హనుమంతరావు తదితర మేధావులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులతో కలిసి పనిచేశారు. యంగ్ ఇండియాలో పనిచేసిన ఇద్దరు క్రియాశీలక సభ్యులు ఎంపీలు అయ్యారంటే సంస్థ పనితీరు ఎలా ఉంటుందో అర్థం అవుతుంది.

పలువురి సంతాపం

నరేంద్రసింగ్ బేడీ మృతి జిల్లా ప్రజలకు తీరనిలోటని పలువురు ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. డా.సురేష్‌బాబు, వెంకటశివారెడ్డి, ఓపీడీఆర్ రామ్‌కుమార్, లయన్స్‌క్లబ్ విరుపాక్షరెడ్డి, తాడికొండ సత్యానారాయణ, పాలినేని నాగేంద్రప్రసాద్, ఆర్ఈఎఫ్ రామచంద్ర, నాగభూషణం, రామకృష్ణ, పౌరహక్కుల సంఘం, ఎస్‌జీఓ నాయకులు బలరాం, కిష్టప్ప, వెంకటేశ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గంగిరెడ్డి, బలరాం తదితరులు నివాళులు అర్పించారు.

బేడీ మృతి తీరనిలోటు..

బుల్.. బుల్.. అని ప్రేమగా పిలుచుకునే నరేంద్ర సింగ్ బేడీ గ్రామీణాభివృద్ధి రంగంలో మార్గదర్శకుడిగా నిలిచారనీ, ఆయన మృతి తీరనిలోటు అని టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మేరీ, బబ్లూ గంగూలీ పేర్కొన్నారు. నరేంద్రసింగ్ బేడీ మృతిచెందిన విషయం తెలిసిన వెంటనే వారు గుట్టూరు సమీపంలోని యంగ్ ఇండియా ప్రాజెక్ట్‌కు చేరుకున్నారు. ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. కరువు పీడిత రాయలసీమలో వేలాది మంది ప్రజల జీవన ప్రమాణాలను మార్చడంలో కీలక పాత్ర పోషించారన్నారు.

బేడీ మృతి బాధాకరం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అనంతపురం విద్య: నరేంద్ర సింగ్ బేడీ మృతి బాధాకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సోమవారం ప్రకటనలో సంతాపం వ్యక్తంచేశారు. యంగ్ ఇండియా ప్రాజక్ట్ ద్వారా ఆయన ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేశారన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకం అమలు చేయడంలో విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు. జిల్లాకు ఆయన అందించిన సేవలు అపారమన్నారు. ఆయన కుటుంబీకులకు సీపీఐ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తుందన్నారు.

ఉపాధి హామీ చట్టం రూపకల్పనలో బేడీ పాత్ర కీలకం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్:

యూపీఏ ప్రభుత్వం వ్యవసాయ కూలీల కోసం తెచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రూపొందించడంలో యంగ్ ఇండియా రూపశిల్పి నరేంద్రసింగ్ బేడీ పాత్ర కీలకమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఆయన ప్రారంభించిన స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు పేదల అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడ్డాయన్నారు. కరువు, రైతు ఆత్మహత్యలు, వలసలు జిల్లా గ్రామీణ జీవితాన్ని విచ్ఛిన్నం చేసినపుడు అనేక సంస్థలతో కలిసి వారికి తోడుగా నిలిచారని గుర్తు చేశారు. ఆయన మృతికి సీపీఎం తరఫున నివాళులర్పిస్తున్నామన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

అడ్డు తొలగించుకునేందుకే హత్య

● ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

హిందూపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వివాహేతర బంధానికి అడ్డు వస్తున్నాడని భర్తను భార్యే.. ప్రియుడితో కలిసి హత్య చేసింది. స్థానిక రహమత్‌పురానికి చెందిన అల్లాబకష్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. అల్లాబకష్ భార్య తబస్సుం, ఆమె ప్రియుడు నదీముల్లాను అరెస్టు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్ సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అరెస్టు వివరాలను టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం వెల్లడించారు. అల్లాబకష్‌కు తొమ్మిదేళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రం దొడ్డబళ్లాపురానికి చెందిన తబస్సుంతో వివాహమైంది. అల్లాబకష్ ఆటోనగర్‌లో బీరువాలు తయారుచేసే షాపులో పనిచేస్తుండేవాడు. రహమత్‌పురానికి చెందిన నదీముల్లా తోపుడుబండ్లపై కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. అతడితో తబస్సుంకు పరిచయం ఏర్పడింది. అదికాస్త వివాహేతర బంధానికి దారితీసింది. విషయం అల్లాబకష్‌కు తెలియడంతో భార్యను పలుమార్లు మందలించాడు. వివాహేతర బంధానికి అడ్డుపడుతున్నాడని భావించిన ఆమె.. భర్తను హతమార్చేందుకు ప్రియుడితో కలిసి పన్నాగం పన్నింది. ఆ మేరకు ఈనెల 18న తెల్లవారుజామున గాఢ నిద్రలో ఉన్న అల్లాబకష్ గొంతుకు చున్నీతో బిగించి, ఊపిరాడకుండా చేసింది. అందుకు ప్రియుడు సహకరించాడు. అల్లాబకష్ చనిపోయాడని నదీముల్లా అక్కడి నుంచి పరాయ్యాడు. కొద్దిసేపటి తరువాత అల్లాబకష్ సోదరికి తబస్సుం ఫోన్ చేసి, 'మీ అన్న ఆరోగ్యం సరిగాలేదనీ, వెంటనే రావాల'ని చెప్పింది. వారు వచ్చి చూసి, అనుమానం రావడంతో నిలదీశారు. దీంతో ఆమె నేరాన్ని ఒప్పుకుంది. అల్లాబకష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు. ఆ మేరకు తబస్సుం, నదీముల్లాను సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ

పెనుకొండ సబ్‌జైలు తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్

పెనుకొండ టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ సోమవారం పెనుకొండ సబ్‌జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌జైలులో వంటగది, స్టోర్‌రూం, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమావేశం ఏర్పాటుచేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు శిక్ష పూర్తి చేసుకుని బయటకు వెళ్లాక సత్‌ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ అజర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.10

అనంతపురం రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 10తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చా యన్నారు. కిలో సరాసరి ధర రూ.8, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.24వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3వేలు, సరాసరి రూ. 15వేలుతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 46 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

803 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 803 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో హెచ్‌ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 454 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

పెరిగిన టీడీపీ కుటుంబం

● ఉమ్మడి జిల్లా ఓటర్లలో 27.72 శాతం మందికి సభ్యత్వం

● అత్యధికంగా శ్రీసత్యసాయి జిల్లాలో 30.54 శాతం

● అనంతలో 25.09 శాతం

● లక్షకుపైగా సభ్యత్వాలతో టాప్‌లో కళ్యాణదుర్గం

● ముగిసిన టీడీపీ సభ్యత్వ నమోదు

అనంతపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదులో తెలుగుదేశంపార్టీ జోరు చూపింది. ఉమ్మడి జిల్లా ఓటర్లలో 27.72 శాతం మంది ఆ పార్టీ సభ్యులుగా చేరారు. బీమా సౌకర్యం కల్పిస్తుంటం కూడా సభ్యత్వ నమోదుకు బాగా ఉపయోగపడింది. క్రియాశీల కార్యకర్తకు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగినా పార్టీ అండగా ఉంటుందనే భరోసాను ఆ పార్టీ అధిష్టానం కలిగిస్తోంది. ఇందులో భాగంగా ఇదివరకూ రూ. 2 లక్షలుగా ఉన్న బీమాను రూ. 5 లక్షలకు పెంచింది. కార్యకర్తలకు బీమా విషయంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌దే ముఖ్య భూమిక. ఉమ్మడి జిల్లాలో టీడీపీ సభ్యత్వాల నమోదు ప్రక్రియ దాదాపుగా ముగిసింది. రెండు నెలలుగా సభ్యత్వాల నమోదు ప్రక్రియ కొనసాగింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా ఓటర్లు 33,82,343 మంది ఉండగా... 9,37,745 మంది ఆ పార్టీ క్రియాశీలక సభ్యత్వాన్ని తీసు కున్నారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాలకుగానూ... లక్షకుపైగా సభ్యత్వాలు చేసి కళ్యాణదుర్గం టాప్‌లో నిలిచింది.

శ్రీ సత్యసాయి జిల్లాలోనే అత్యధికం

శ్రీసత్యసాయి జిల్లాలోనే అత్యధికంగా టీడీపీ సభ్యత్వాలు నమోదయ్యాయి. ఆ జిల్లాలో ఓటర్లు 16,35,029 మంది ఉండగా... అందులో 4,99,308 మంది టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఇది 30.54 శాతంగా నమోదైంది. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే... కదిరి 89,378 సభ్యత్వాలతో మొదటి స్థానంలో నిలిచింది. ఆ తరువాత పెనుకొండ 83,581, రాప్తాడు 80,339, మడకశిర 66,827, పుట్టపర్తి 65,177, ధర్మవరం 62,031, హిందూపురంలో 51,975 సభ్యత్వాలు నమోదయ్యాయి. నియోజకవర్గాల్లోని ఓటర్ల వారీగా పరిశీలిస్తే... కదిరిలో 2,53,600 మంది ఓటర్లు ఉండగా 35.24 శాతం టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. పెనుకొండలో 2,33,306 మంది ఓటర్లు ఉండగా... 35.82 శాతం, రాప్తాడులో 2,46,472 మంది ఓటర్లుండగా 32.59 శాతం, మడకశిరలో 2,10,519 మంది ఓటర్లుండగా 31.74 శాతం, పుట్టపర్తిలో 2,09,684 మంది ఓటర్లు ఉండగా 31.08 శాతం, ధర్మవరంలో 2,33,490 మంది ఓటర్లు ఉండగా... 26.56 శాతం, హిందూపురం లో 2,47,958 మంది ఓటర్లుండగా... 20.96 శాతం మంది టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్న వారిలో ఉన్నారు.

అనంతలో...

అనంతపురం జిల్లాలో 17,47,314 మంది ఓటర్లుండగా 25.09 శాతం మంది టీడీపీ సభ్యతం తీసుకున్నారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే... కళ్యాణదుర్గంలో 1,01,262 సభ్యత్వాలతో మొదటి స్థానంలో ఉండగా... మిగిలిన స్థానాల్లో రాయదుర్గం 78,413, అనంతపురం అర్బన్ 72,155, గుంతకల్లు 61,952, ఉరవకొండ 53,918, శింగనమల 47,592, తాడిపత్రి నియోజకవర్గంలో 23,145 మంది టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. నియోజకవర్గాల్లోని ఓటర్ల వారీగా పరిశీలిస్తే... కళ్యాణదుర్గంలో 2,28,421 మంది ఓటర్లు ఉండగా 44.33 శాతం మంది టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. రాయదుర్గంలో 2,63,219 మంది ఓటర్లుండగా 29.79 శాతం, అనంతపురం అర్బన్‌లో 2,77,156 మంది ఓటర్లుండగా... 26.03 శాతం, గుంతకల్లులో 2,64,745 మంది ఓటర్లుండగా... 23.40 శాతం, ఉరవకొండలో 2,19,996 మంది ఓటర్లుండగా... 24.50 శాతం, శింగనమలలో 2,45,851 మంది ఓటర్లుండగా... 19.35 శాతం, తాడిపత్రిలో 2,47,926 మంది ఓటర్లుండగా 9.33 శాతం మంది ఓటర్లు టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు.

శాశ్వత సభ్యత్వాల్లో అనంత టాప్...

ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో మొత్తం 43 మంది టీడీపీ శాశ్వత సభ్యత్వాలను పొందారు. ఒక్కొక్కరు రూ.లక్ష చెల్లించి పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. కాగా... పార్టీ శాశ్వత సభ్యత్వాల నమోదులో అనంత జిల్లా టాప్‌లో నిలిచింది. జిల్లాలో 31 మంది శాశ్వత సభ్యత్వాన్ని తీసుకోగా... శ్రీసత్యసాయి జిల్లాలో 12 మంది మాత్రమే శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే... కళ్యాణ దుర్గంలో 2, రాయదుర్గంలో 6, అనంతపురం అర్బన్‌లో 9, గుంతకల్లులో 6, ఉరవకొండలో 4, శింగనమలలో 3, తాడిపత్రిలో ఒకరు శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో కదిరిలో 2, మడకశిరలో 4, హిందూపురంలో 2, పెనుకొండ, రాప్తాడు, పుట్టపర్తి, ధర్మవరంలో ఒక్కొక్కరు చొప్పున పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు.

కొత్త వారే అధికం

ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో కొత్త వారికి అత్యధికంగా పార్టీ సభ్యత్వాన్ని ఇవ్వడంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు చొరవ చూపారు. రెన్యువల్‌తో పాటు కొత్తగా అత్యధిక మందికి సభ్యత్వాన్ని ఇచ్చారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 60,486 మందికి, రాయదుర్గంలో 39,249 మందికి, అనంతపురం అర్బన్‌లో 55,817 మందికి, గుంతకల్లులో 40,542 మందికి, ఉరవకొండలో 30,123 మందికి, శింగనమలలో 25,838 మందికి, తాడిపత్రిలో 14,191 మందికి కొత్తగా పార్టీ సభ్యత్వాన్ని నమోదు చేయించారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,38,437 మందికి పార్టీ సభ్యత్వాన్ని ఇవ్వగా... అందులో రెన్యువల్ 1,72,191 పోగా... కొత్తగా 2,66,246 మందికి పార్టీ సభ్యత్వాన్ని ఇచ్చారు. శ్రీసత్యసాయి జిల్లాలోని కదిరి నియోజకవర్గంలో 54,793 మందికి, పెనుకొండలో 51,578 మందికి, రాప్తాడులో 37,300 మందికి, మడకశిరలో 42,815 మందికి, పుట్టపర్తిలో 35,363 మందికి, ధర్మవరంలో 29,656 మందికి, హిందూపురంలో 29,344 మందికి కొత్తగా పార్టీ సభ్యత్వాన్ని ఇచ్చారు. శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా 4,99,308 మందికి పార్టీ సభ్యత్వం ఇవ్వగా... అందులో రెన్యువల్ 2,18,459 పోగా... మిగిలిన 2,80,849 మందికి పార్టీ సభ్యత్వాన్ని ఇచ్చారు.

న్యూస్ బాక్స్

పశు ఆరోగ్య శిబిరాలు ప్రారంభం

తొలి రోజు 61 ప్రాంతాల్లో నిర్వహణ

అనంతపురం అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పశు ఆరోగ్య శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా నిర్వహించేందుకు మండలానికి రెండు బృందాలు చొప్పున 31 మండలాలకు 62 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందానికి వెటర్నరీ డాక్టర్, సిబ్బందిని నియమించారు. తొలి రోజు జిల్లాలోని 61 ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహించినట్లు పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి తెలిపారు. ఈ నెలాఖరు వరకు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

● అనంతపురం రూరల్: మండలంలోని ఆలమూరులో సోమవారం పశువులకు నట్టల నివారణ మందులు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీమండల నాయకులు ఆల మూరు సూర్యనారాయణ హాజరై ప్రారంభించారు. పశువైద్యాధికారి ఉష, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● గార్లదిన్నె: మండల పరిధిలోని గార్లదిన్నె, ముకుందాపురం గ్రామాల్లో సోమవారం పశువైద్యాధికారి రమేష్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. పశువైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్లు రమేష్‌రెడ్డి, సుధాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గార్లదిన్నె, యర్రగుంట్ల వైద్యాధికారులు రమేష్, ఆంజినేయులునాయక్, రైతులు గుత్తాహరి, ప్రసాద్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

●నార్పల: మండల పరిధిలోని బొందలవాడ, చామలూరులో సోమవారం పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పశువైద్యాధికారి గోవిందరాజులు గొర్రెలు, మేకలు, పశువులు, దూడలకు పరీక్షలు చేసి నట్టల నివారణ మందులను రైతులకు అందజేశారు.

● చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని వెల్దుర్తి గ్రామంలో సోమవారం పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. పశువైద్యాధికారి శివకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆవులు, గేదెలకు వివిధ జబ్బులకు వైద్యచికిత్సలు అందించారు. పశువైద్య అసిస్టెంట్‌లు ఓబుళపతి, సురేంద్రరాజు, అనిల్, తిమ్మయ్య, సౌజన్య, గోపాలమిత్ర ఓబుళేశు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



ప్రొఫెసర్ క్రిష్ణకుమారి నుంచి పీహెచ్‌డీ అందుకుంటున్న విజయ్

అనంతపురం విద్య, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ విజయ్ ఎస్కేయూ నుంచి సోమవారం డాక్టరేట్ పొందారు. ఆయన ఎస్కేయూ నుంచి జాగ్రఫీలో పీహెచ్‌డీ పరిశోధన చేశారు. యూనివర్సిటీ ప్రిన్సిపాల్, మాజీ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ క్రిష్ణకుమారి పర్యవేక్షణలో 'కరువు పీడిత అనంతపురం జిల్లా, మున్సిపాలిటీల్లో శ్రామిక జనాభా స్థితిగతులు ' అనే అంశంపై పరిశోధన చేశారు. అదేవిధంగా పలు జాతీయ, అంతర్జాతీయ జనరల్స్ ప్రచురించారు. దీంతో ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయనకు పరిశోధక విద్యార్థులు, పలురువు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి ఎమ్మెల్యే నివాళి



పోట్ల రామప్పకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉపాధ్యాయుడు పోట్ల రామప్పకు ఎమ్మెల్యే దగ్గు పాటి వెంకటేశ్వరప్రసాద్ నివాళులర్పించారు. పోట్ల రామప్ప అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం ఆయన నివాసానికి చేరుకున్నారు. పోట్ల రామప్ప భౌతక కాయానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సమస్యలపై ఎమ్మెల్యే స్పందన హర్షణీయం

అనంతపురం కల్చరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ కాలనీలోని ముస్లింల కబరస్థాన్‌లో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ స్పందించడం హర్షణీయమని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి పేర్కొన్నారు. కబరస్థాన్‌లో చెత్తాచెదారం పేరుకు పోయి ఉండడంపై ఇటీవల ఎమ్మెల్యేకు సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం నగరపాలక పారిశుధ్య కార్మికులను కబరస్థాన్‌కు పంపి చెత్తాచెదారాన్ని తొలగించారు. కబరస్థాన్ ప్రహరీ, వీధిలైట్లను సరిచేసి, తాగు నీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని కోరారు.

90 ప్రైవేటు బస్సులపై కేసులు

అనంతపురం అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ నేపథ్యంలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ సంద ర్భంగా... నిబంధనల అతిక్రమించిన 90 ప్రైవేటు బస్సులపై కేసులు నమోదు చేసినట్లు ఉప రవాణా కమిషనర్ వీర్రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాటిపై మొత్తం రూ.19.27 లక్షల అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు. ఇందులో మూడు బస్సులపై అధిక చార్జీల వసూలు, ఐదు బస్సులకు రోడ్ ట్యాక్స్ లేకపోవడం, 82 బస్సులపై సరుకు రవాణా, అతిక వేగం, రిఫ్లెక్టర్ లేకపోవడం తదితర కారణాలతో కేసులు నమోదు చేశామని తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నార్పల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం బీ పప్పూరు పీహెచ్‌సీ వైద్యాధికారి మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య సమస్యలున్న విద్యార్థులను జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేశారు.

ఆటో బోల్తా.. ఒకరికి గాయాలు



దెబ్బతిన్న ఆటో

కనగానపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్ళపల్లి వద్ద 44వ జా తీయ రహదారిపై ఆర్టీటీ కార్యాలయం ఎదురుగా సోమవారం ఉదయం అదుపు తప్పి ఓ ఆటో బోల్తా పడింది. ఒకరు గాయపడ్డారు. రామగిరి మండలం కుంటిమద్ది గ్రామానికి చెందిన వేణు పాలక్యాన్లతో ఆటోలో అనంతపురం వెళుతున్నాడు. మార్గమధ్యంలో మామిళ్ళపల్లి ఆర్టీటీ కార్యాలయం వద్ద అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటో పాక్షికంగా దెబ్బతినటంతో పాటు డ్రైవర్ వేణు గాయపడ్డాడు. స్థానికులు అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

పైలట్ రీసర్వే సక్రమంగా జరిగేనా..?

● వైసీపీ పాలనలో భారీ తప్పులు ● ఆందోళనలో రైతులు



పెద్ద మట్లగొందిలో భూ రీసర్వే చేస్తున్న అధికారులు

శింగనమల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో చేపట్టిన భూ రీసర్వేలో రైతుల భూ విస్తీర్ణానికి సంబంధించి భారీ వ్యత్యాసాలు వచ్చాయనే విమర్శలు వచ్చాయి. దీంతో చాలా చోట్ల రీసర్వే వద్దన్నారు. అయినా పాలకులు అధికాలు బలవంతంగా భూ రీసర్వే చేపట్టి, వ్యత్యాసాలతోనే జాయింట్ ఖాతా నంబర్లు, ఎల్‌పీ నంబర్లతో భూహక్కు పుస్తకాలను సంబంధిత రైతులకు ఇచ్చి, అలాగే వైబ్‌ల్యాండ్‌లో నమోదు చేశారు. రీ సర్వే వల్ల భూముల విస్తీర్ణం తదితర విషయాల్లో వచ్చిన తప్పులను సరిచేసుకునేందుకు రైతులు ఇప్పటి వరకు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తప్పుల వల్ల బ్యాంకు రుణాల విషయంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. అయితే రీసర్వే రద్దు చేసి పాత పద్ధతినే అమలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వ ఏర్పడడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం రీసర్వేని రద్దు చేయకపోగా, మరలా పైలెట్ గ్రామాలను ఎంపిక చేసి భూముల రీసర్వే చేపట్టడంతో రైతుల్లో ఆందోళన మెదలైంది. ఈ రీసర్వేనైనా ఎలాంటి తప్పులు లేకుండా చేయాలని అధికారులను రైతులు కోరుతున్నారు.

పైలట్ గ్రామం పెద్ద మట్లగొందిలో రీసర్వే

మండలంలోని పెద్ద మట్లగొంది రెవెన్యూ గ్రామంలో ఉన్న 2.685 ఎకరాలను పైలట్ రీసర్వేకు ఎంపిక చేశారు. అందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృదం ప్రతి రోజు దాదాపు 20 ఎకరాల్లో సర్వే చేసే విధంగా ప్రణాళికలు తయారు చేసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమగ్ర రీసర్వే చేసేట్లు సోమవారం పనులు ప్రారంభించారు. గత వైసీపీ పాలనలో 13 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పనులు చేయగా అన్ని చోట్ల భారీ ఎత్తున వ్యత్యాసాలు రావడంతో కొన్ని గ్రామాల్లో అధికారులను రైతులు నిలదీ శారు. ఇప్పుడు పైలెట్ గ్రామాల్లో రీసర్వే ఖచ్చితంగా చేస్తారో చేదో వేచిచూడాలి.

ఎల్‌పీ నంబర్లు ఇవ్వకుండా సర్వే చేయాలి



వైసీపీ హయాంలో రీసర్వే చేయగా రైతుల విస్తీర్ణంలో ఎక్కువ తక్కువలు వచ్చాయి. దీంతో రైతులు మధ్య గొడవలు జరిగాయి. జాయింట్ ఖాతా కింద ఇచ్చిన ఎల్‌పీ నంబర్లతో రైతులకు బ్యాంకుల్లో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎల్‌పీ నంబర్లు ఇవ్వకుండా రైతు వారీగా రీసర్వే చేసి విస్తీర్ణంలో తప్పులు లేకుండా చూడాలి.

- ఆదినారాయణ, రైతు, పెద్ద మట్లగొంది

రద్దు చేస్తామని... ప్రారంభమా..?



వైసీపీ పాలనలో చేసిన రీసర్వే వల్ల భూముల కొలతలో భారీ వ్యత్యాసాలు వచ్చాయి. దీంతో చాలా గ్రామాల్లో రైతుల మధ్య గొడవలు జరిగాయి. దీంతో పాటు బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతులు రెన్యువల్ చేసుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డారు. రీసర్వే రద్దు చేసి పాత పద్ధతినే కొనసాగిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు చెప్పారు. అయితే ఇప్పడు పైలెట్ రీసర్వే పేరుతో ప్రారంభించడం ఏమిటి? వెంటనే కూటమి ప్రభుత్వం రీసర్వేపై పునరాలోచన చేసుకోవాలి.

- చిన్నప్పయాదవ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

విస్తీర్ణం ఖచ్చితంగా చూపాలి



మా గ్రామాన్ని పైలట్ రీసర్వేకి ఎంపిక చేశారు. మా భూముల హద్దులను చూపుతాం. అధికారులు కొలతలు తీసి భూ విస్తీర్ణంలో ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా చూడాలి. అక్కడే రైతులకు వివరాలు తెలిపాలి. లేనిపక్షంలో రీసర్వే పనులను అడ్డుకుంటాం.

- సుదర్శన్, రైతు, పెద్ద మట్లగొంది

రీసర్వే అంటే భయపడుతున్నాం



పైలెట్ గ్రామం కింద సోమవారం నుంచి మా ఊరిలో రీసర్వే పనులు చేస్తున్నారు. గతంలో భూముల విస్తీర్ణంలో తప్పులు రావడంతో అ రైతులు ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రీసర్వే అంటే భయపడుతున్నాం. అయితే అధికారులు మాత్రం ఈసారి ఎలాం టి తప్పులూ జరుగవంటున్నారు.

- చంద్రశేఖర్, రైతు, పెద్ద మట్లగొంది

మూడు బృందాలతో రీసర్వే

శింగనమండలంలోని పెద్ద మట్లగొంది రెవెన్యూ గ్రామంలో 2,685 ఎకరాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద పనులు ప్రారంభించాం. ఒక్కో బృందం రోజుకు 20 ఎకరాలు చొప్పున, మూడు బృందాలతో సర్వే చేస్తున్నాం. ఎలాంటి తప్పులు లేకుండా రీసర్వే చేస్తాం.

- స్టీఫెన్ వీరాకుమార్, మండల సర్వేయర్

రైతుల సమక్షంలోనే కొలతలు

పైలట్ రెవెన్యూ గ్రామంలో రోజు 20 ఎకరాలు మాత్రమే రీసర్వే చేస్తాం. అదా కూడా రైతుల సమక్షంలోనే వారు చూసిన హద్దుల మేరకు రీ సర్వే చేస్తాం. ఎలాంటి తప్పులు లేకుండా చూస్తాం. రైతులు సహకరించాలి.

- పునీత్‌కుమార్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్

సమగ్రంగా రీసర్వే చేస్తాం

మండలంలోని పెద్ద మట్లగొంది గ్రామంలో రీసర్వే పనులు చేసున్నాం. రీసర్వేపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. గతంలో మాదిరి ఎలాంటి తప్పులు లేకుండా సమగ్రంగా రీసర్వే చేస్తాం.

- సాకే బ్రహ్మయ్య, తహసీల్దార్

సొసైటీలను బలోపేతం చేయాలి: ఎమ్మెల్యే



ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసిన ప్యాదిండి సహకార సంఘం సభ్యులు

చెన్నేకొత్తపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాలను బలోపేతం చేయడానికి నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు కృషిచేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. నూతనంగా ఎంపికైన మండలంలోని ప్యాదిండి గ్రామానికి చెందిన గొర్రెల పెంపకం దారుల సంఘం సభ్యులు సోమవారం వెంకటాపురంలో ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డితో కలిసి సంఘం అధ్యక్షురాలు గంగమ్మ, ఉపాధ్యక్షుడు పోతలయ్య, డైరెక్టర్‌లు మురళి, రమేశ్, లక్ష్మీనరసమ్మ, ఉమాదేవి, రామచంద్ర తదితరులు ఉన్నారు. నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీపీ ప్రసాదమ్మ, టీడీపీ నాయకులు చందమూరు ప్రభాకర్ పాల్గొన్నారు.

24న ఆణిముత్యాలు నాటక ప్రదర్శన

అనంతపురం రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల సంగీత నాటక అకా డమి ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన ఆణిముత్యాలు నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఆ వి భాగం మండల అధ్యక్షుడు రత్నమోహన్ తెలిపారు. సంబంధిత పోస్టర్లను సోమవారం నగరంలోని ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. రూరల్ మండలపరిధిలోని పాపంపేటలో ఉన్న బాలాజీ ఐస్ ఫ్యాక్టరీ వద్ద నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు రత్నమోహన్ తెలిపారు. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'పరిటాల రవీంద్ర సేవలు మరువలేనివి'

కనగానపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి దివంగతనేత పరిటాల రవీంద్ర అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, కన్వీనర్ యాతం పోతలయ్య, క్లస్టర్ ఇన్‌చార్జ్ సుధాకర్‌చౌదరి పేర్కొన్నారు. స్థానిక పరిటాల భవన్‌లో వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 24న పరిటాల రవీంద్ర వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులు, టీడీపీ శ్రేణులు వెంకటాపురంలోని పరిటాల రవీంద్ర ఘాట్ నివాళులు అర్పిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామాధ్యక్షుడు కసమూర్తి వెంకటేష్, సర్పంచ్ అంకే రామక్రిష్ణ, ఎంపీటీసీ బిల్లే భాస్కర్, శ్రీరాములు, రాజాక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలి : సీపీఐ

అనంతపురం రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న పేదలకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని సీపీఐ రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆ మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులతో కలసి ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ యోగేంద్ర ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ..మండలంలోని సోములదొడ్డి, కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని ఐజీ నగర్, అక్కంపల్లి పంచాయతీలోని సదాశివన్ కాలనీ తదితర కాలనీలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలన్నారు. దశాబ్ధకాలనీకి పైగా ఆయా ప్రాంతాల్లో పేదలు గుడిసెలు, షెడ్లు వేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన మేరకు ఆయా ప్రాంతాల్లోని పేదలకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలన్నారు.

నాడు స్వప్రయోజనాల కోసమే ఢిల్లీకి జగన్

● రాష్ట్ర ప్రయోజనాల కోసం చంద్రబాబు: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

గార్లదిన్నె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో సీఎం హోదాలో వైఎస్ జగన్ తన స్వప్రయోజనాల కోసం ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టాలరని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఘటుగా వాఖ్యనించారు. అదే నేడు కూటమి ప్రభుత్వంలో సీఎం హోదాలో చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాల కోసం హస్తినకు వెళుతున్నారని అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు ఢిల్లీ వెళ్లిన ప్రతి సారి రాష్ట్రానికి ఎంతో మేలు చేకూరుతోందన్నారు. నాడు వైసీపీ ప్రభుత్వం ఉత్తరాంధ్రుల మణిహారమైన ఉక్కు విశాఖ ఉక్కు కర్మగారాన్ని ప్రైవేట్‌పరం చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేసిందన్నారు. ఆ పరిశ్రమను అప్పుల ఊబి నుంచి ఆదాయ దిశగా తీసుకొచ్చేందుకు చంద్రబాబు కేంద్రం నుంచి రూ. 11,440 కోట్లు నిధులు సాధించారన్నారు. వేలాది మంది జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే చంద్రబాబు సీఎంగా ఉంటేనే సాధ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ప్రారంభం



డీఈఓను సన్మానిస్తున్న తేజ నిర్వాహకులు

అనంతపురం విద్య జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్తోమత లేని అభ్యర్థులకు తేజ అకాడమీ నిర్వాహకులు ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇవ్వడం అభినందనీయమని డీఈఓ ప్రసాద్ బాబు, డీఎండబ్ల్యూఓ రామసుబ్బారెడ్డి పేర్కొ న్నారు. రఘువీరా టవర్స్‌లో నిర్వహిస్తున్న డీఎస్సీ ఉచిత కోచింగ్ తరగతులను డీఈఓ ప్రసాద్‌బాబు, డీఎండబ్ల్యూఓ రామసుబ్బారెడ్డి సోమవారం ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తేజ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో మంచి టీచర్లుగా ఎదగాలన్నారు. తర్వాత తేజ అకాడమీ డైరెక్టర్ తేజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... ఏపీ కానిస్టేబుల్ మెయిన్స్‌కు ప్రిపేర్ అయ్యే పేద అభ్యర్థులకు సైతం త్వరలోనే ఉచితంగా శిక్షణ ఇస్తామని తెలిపారు. ఔత్సాహిక అభ్యర్థులు దరకాస్తు చేసుకోవాలని తెలిపారు. డీఈఓ, డీఎండబ్ల్యూఓను తేజ అకాడమీ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో అకాడమీకి చెందిన మౌనిక, ఫాతిమా, కస్తూరి, షంషాద్, వెంకట్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రజిత, మధు తదితరులు పాల్గొన్నారు.

'వర్గీకరణ జరిగితేనే అందరికీ న్యాయం'



కమిషన్‌కు వినతి పత్రం ఇస్తున్న జడ్పీటీసీ

అనంతపురం రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులాల రిజర్వేషన్ల వర్గీకర ణ జరిగితేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని మండల జడ్పీటీసీ చంద్రకుమార్ పేర్కొన్నారు. ఆమేరకు సోమవారం ఎస్సీల ఉపవర్గీకరణ ఏకసభ్య విచారణ కమిషన్ రాజీవ్ రంజాన్ మిశ్రాను కలసి కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అధ్య యనం కోసం ఏక సభ్య కమిటీ ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. క్షేత్ర స్థాయిలో షెడ్యుల్ కులాలు-మాదిగలు ఎదుర్కొంటున్న సమస్యలను, వివక్ష ను అన్నింటినీ దృష్టిలో ఉంచుకుని మాదిగల చిరకాల ఆకాంక్ష అయినటువం టి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయుటకు సానుకూలంగా స్పందించాలన్నారు.

సొసైటీ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి

●కార్మిక సంఘాల నాయకుల డిమాండ్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సొసైటీ ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సొసైటీ ఉద్యోగులకు హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలని కార్మి క సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ సీఐటీయూ అనుబం ధ ఏపీ స్టేట్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు ఎస్ ఆంజనేయులు, జే హరికృష్ణ మాట్లాడారు. 2019లో అప్పటి ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబరు 36ను అమలు చేయకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ వచ్చిందన్నారు. దీంతో సొసైటీ ఉద్యోగులు హెచ్‌ఆర్ పాలసీ వర్తింపచేయక పోవడంతో తీవ్రంగా నష్టపోయా రని తెలిపారు. జిల్లా సహకార శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామ చంద్రయ్య, శ్రీరాములు, మలరాయుడు, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు సొసైటీ ఉద్యోగుల ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. అనంతరం కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, నాయకులు హనుమంతరెడ్డి, రామాంజినేయులు, దామోదర్, తాడిపత్రి శ్రీనివాసులు, నరేంద్రరెడ్డి, బొజ్జప్ప దితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీనివాస కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): విష్ణు సహస్ర నామ సత్సంగ మండలి ఆధ్వర్యంలో సోమవారం ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీవెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ ఆవరణలోని వేదికపై స్వామివార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ కల్యాణోత్సవాన్ని శాస్త్రబద్ధంగా నిర్వహించారు. మహామంగళహారతి నివేదనానంతరం అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, విష్ణు సహస్రనామ సత్సంగ మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘంలోకి జిల్లా వాసి



సాకే శివశంకర్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం కార్యవర్గ సభ్యుడిగా సాకే శివశంకర్‌కు చోటు దక్కింది. విశాఖ పట్నంలో ఆదివారం ఏపీ రాష్ట్ర హ్యాండ్‌బాల్ కార్య వర్గ సమావేశం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అధ్యక్షుడిగా యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సత్య నారాయణరాజు ఎన్నికకాగా జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న తనను రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా ఎన్నుకున్నట్టు తెలిపారు.

విద్యతో పాటు క్రీడలూ ముఖ్యమే: షాబుద్దీన్



విద్యార్థులతో క్రికెటర్ షాబుద్దీన్

అనంతపురం విద్య జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు బాల్యంలో విద్యతో పాటు క్రీడలూ ముఖ్యమేనని ఐపీఎల్ ముంబై టీం క్రికెటర్ షాబుద్దీన్ పేర్కొన్నారు. ఆర్టీటీ క్రీడా మైదానంలో సోమవారం జరిగిన భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భవిష్యత్తులో క్రీడలకు మరింత ప్రాధాన్యం పెరుగుతుందని, తల్లిదండ్రులు సైతం విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహించాలని సూచించారు. క్రికెట్ టోర్నీలో తూర్పు గోదావరి ఎంపేరర్స్, అనంతపురం ఎవెంజర్స్ జట్ల మధ్య పోటాపోటీగా పోరు సాగింది. గెలుపొందిన తూర్పు గోదావలి జట్టును అభినందించారు. కార్యక్రమంలో రాయలసీమ సీఈఓ అనిల్ కుమార్, అనంతపురం జోన్ జెడ్‌ఈఓ రవివర్మ, తూర్పుగోదావరి జెడ్‌ఈఓ ఆంజనేయులు, ప్రిన్సిపాళ్లు బాలకృష్ణ, ప్రణీత, హరిబాబు, జెడ్‌సీఓ భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌పై శానిటేషన్ పరిశీలన



పారిశుధ్య విభాగం సిబ్బందితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్

అనంతపురం క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): శిక్షణ నిమిత్తం జిల్లాకు వచ్చిన అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న నగరపాలికలో సైకిల్‌పై పారిశుధ్యం పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం 6.15 గంటల నుంచి అసిస్టెంట్ కలెక్టర్ సైకిల్‌పై పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పరిశీలించారు.

'అనధికార ఫీల్డ్ అసిస్టెంట్‌తో ఉపాధి పనులా..?'

శింగనమల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ తీర్మానం లేకుండా పంచాయతీలో అనధికార ఫీల్డ్ అసిస్టెంట్‌తో ఉపాధి పనులు ఎలా చేయిస్తున్నారంటూ ఏపీఓతో పెద్ద మట్లగొంది సర్పంచ్ పి.రమేష్ వాగ్వాదానికి దిగారు. సర్పంచు సోమవారం ఎంపీడీఓ కార్యాల యంలో ఏపీఓ శ్రీదేవిని కలిశారు. మండలంలోని పెద్ద మట్లగొంది పంచాయతీలో పాత ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించలేదు. అయితే పంచాయతీ తీర్మానం లేకుండా అనధికార ఫీల్డ్ అసిస్టెంట్ నియమించి గ్రామంలో ఉపాధి పనులు ఎలా చేయిస్తారని ప్రశ్నించారు. గ్రామ సర్పంచ్‌కు ఇచ్చే విలువ ఇదేనా అన్నారు. అలాగే వెస్తునరసాపురం పంచాయతీలో నాగులగుడ్డం గ్రా మానికి చెందిన రైతు అంజనప్ప చేపట్టిన పండ్ల పెంపకం బిల్లులు చెల్లించలేదని నాగులగుడ్డం గ్రామానికి చెందిన వెంకటరాముడు ఏపీఓకు పిర్యాదు చేశాడు.

నేడు పింఛన్ల పరిశీలన

రాప్తాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నడవలేని స్థితిలో ఉండి మంచానికి పరిమితమై రూ. 15 వేలు పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను మంగళవారం ప్రత్యేక వైద్య బృందం పరిశీలన చేయనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. మూడు బృందాలుగా పరిశీలిస్తారని తెలిపారు.

ఎస్సీ కులగణన పక్కాగా నిర్వహించాలి

నార్పల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణనపై పక్కాగా సర్వే చేయించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు, శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుల్లయ్య పేర్కొన్నారు. ఈ మేరకు అనంతపురంలోని కలెక్టరేట్ లో సోమవారం ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు ఎమ్మార్పీఎస్ నార్పల శాఖ నాయకుల తరఫున లేఖ అందించినట్లు వారు తెలిపారు. ఎస్సీ కులగణనలో అనేక అవకతవకలు జరిగాయని, ప్రతి ఇంటికి వెళ్లి పక్కాగా సర్వే చేయించాలని కమిషన్‌ను కోరినట్లు తెలిపారు.

ఘనంగా అంకాలమ్మ, కుంటెమ్మల జాతర

పామిడి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండూరు రోడ్డులో వెలసిన అంకాలమ్మ, కుంటెమ్మ అమ్మవార్ల జాతర సోమవారం ప్రారంభమైంది. ఈ జాతర మూడు రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో భక్తులు జాతను నిర్వహిస్తారు. మొదటి రోజు ఉరుముల వాయిద్యాల మధ్య అమ్మవార్ల గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామంలో ప్రతి ఆలయంలోనూ కొబ్బరికాయలు సమర్పిస్తూ ఈ గ్రామోత్సవం సాగింది. మంగళ, బుధవారాల్లో రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించి విజయం సాధించిన వాటి యజమానులకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు జాతర నిర్వాహకులు తెలిపారు.

నేడు కొల్లాపురమ్మ జాతర

బెళుగుప్ప: మండలంలోని ఎలగలవంకలో మంగళవారం కొల్లాపురమ్మ జాతరను ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్థులు సోమవారం తెలిపారు. రెండురోజుల పాటు జాతర జరపనున్నట్లు చెప్పారు.

రైల్వే పోలీస్ డైరీ ఆవిష్కరణ

గుంతకల్లుటౌన్, జనవరి20(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే పోలీస్ అసోసియేషన్ డైరీని విజయవాడలోని రైల్వే ఐజీ ఛాంబర్‌లో సోమవారం ఆవిష్కరించారు. రైల్వే ఐజీ కేవీ మోహన్‌రావు, గుంతకల్లు రైల్వే ఎస్పీ రాహుల్‌మీనా చేతుల మీదుగా వాటిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుంతకల్లు రైల్వేపోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఆర్‌ఐ రామాంజనేయులు, సీఐడీ అసోసియేషన్ అధ్యక్షుడు అక్కిరాజు, రాష్ట్రకోఆప్షన్ సభ్యురాలు భవాని తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై విచారణ చేపట్టండి

రాయదుర్గంరూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిసరాల చుట్టూ వెలసిన అక్ర మ లేఅవుట్‌లపై విచారణ చేపట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొట్రేష్, సీపీఐ తాలూకా కార్యవర్గ సభ్యులు తిప్పేస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వారు తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

విషజ్వరాలపై అవగాహన

రాయదుర్గంరూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులదట్ల గ్రామంలో సోమవారం మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్త పడాలన్నారు. దోమతెరలు వాడాలని, సాయంత్రం ఇళ్ల ముంగిట వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు వాడాలని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ సుజాత, ఏఎన్‌ఎం మాంతేశ్వరి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గుంతకల్లుటౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గుర్రబ్బాడు, తురకపల్లి, వన్నేదొడ్డి, గుత్తి, పాతగుంతకల్లుతో పాటు కర్నూలు జిల్లాకు చెందిన ఆరుగురికి రూ. 5,32,199ల సీఎంరిలీఫ్ ఫండ్ మంజురైంది. అందుకు సంబంధించిన చెక్కులను పట్టణంలో తన కార్యాలయంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరా సోమవారం సాయంత్రం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే తనయుడు ఈశ్వర్, సర్పంచు శ్రీరాములు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సునామా జకినీ మాత ఉత్సవాల పోస్టర్ల విడుదల

గుత్తి: పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో ఉన్న సునామా జకినీమాత , మల్యామా జకినీ మాత ఆలయాల వద్ద ఫిబ్రవరి 6, 7వ తేదీల్లో ఉత్సవాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆలూరులోని తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ఉత్సవాలను అందరూ జయప్రదం చేయాలని కోరారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్కారి ఆలూరు లక్ష్మణ్‌రావు, ధర్మకర్త సురేష్‌రావు, ఆలయ వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్, గౌరవాధ్యక్షుడు సాయిబాబా, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ కేంద్రాల ఏర్పాటు

బ్రహ్మసముద్రం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలలో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కేంద్రాలు మంగళవారం తేదీ నుంచి ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో నందకిషోర్ సోమవారం తెలిపారు. ఆయా గ్రామాల్లో 30వ తేదీ వరకు వీటిని నిర్వహిస్తామన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలని, ఉన్న వాటిలో మార్పులు, చేర్పులు ఉంటే చేసుకోవచ్చని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుట్లూరు: మండలవ్యాప్తంగా సచివాలయాల్లో ఆధార్ కేంద్రాల సేవలు అందుబాటులో పెడుతున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ తెలిపారు. ఈనెల 21 నుంచి 30వరకు ఏర్పాటు చేయనున్నామన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శెట్టూరు:అడవి గొల్లపల్లి, చింతర్లపల్లి గ్రామాలలో ఈ నెల 22వ తేదీన ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఘురామారావు ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గొర్రెల పెంపకందారుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

కుందుర్పి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కుసుమగిరి గొర్రెల పెంపకం సంఘం ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగినట్లు పశువైద్యాధికారి ప్రసాద్ తెలిపారు. అధ్యక్షుడిగా శేషాద్రి, ఉపాధ్యక్షుడిగా పెద్ద గంగప్ప, ఏడుగురు డైరెక్టర్లు ఎన్నికైనట్లు చెప్పారు. టీడీపీ నాయకులు పెద్ద నరసింహప్ప, మల్లికార్జున, కుందుర్పి గ్రామ కన్వీనర్ రంగనాథ్, సాగునీటి సంఘం అధ్యక్షుడు రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ చిల్డ్రన్స్ హోం పరిశీలన

కణేకల్లు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని క్రాసింగ్‌లో ఉన్న ఆర్డీటీ చిల్డ్రన్స్ హోంను జిల్లా పర్యవేక్షణ అధికారులు సోమవారం పరిశీలించారు. జిల్లా పర్యవేక్షణ టీం కన్వీనర్ ఫరూక్‌బాషా, కో కన్వీనర్ మంజునాథ్, జిల్లా ప్రొహిబిషన్ అధికారి లక్ష్మీప్రసన్న, ప్రొటెక్షన్ అధికారులు వెంకటేశ్వరి, సంధ్యారాణి తదితరులు చిల్డ్రన్స్ హోమ్‌ను పరిశీలించి బుద్ధిమాంద్యం విద్యార్థుల రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇక్కడ తాము పరిశీలించిన అంశాలను కలెక్టర్‌కు నివేదిక ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు.

ఎరువుల కొరతపై రైతుల ఆందోళన

గుమ్మఘట్ట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): బీటీపీ సాగునీరుతో పంటలు సాగు చేసుకునేందుకు సిద్ధమైన రైతులకు డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ ఎరువులు కొరత ఏర్పడింది. దీంతో వాటిని వెంటనే అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తే ఆయా రైతులు ఆందోళనకు దిగారు. రంగచేడు గ్రామంలోని రైతుసేవా కేంద్రం గోదాం వద్ద సోమవారం దాదాపు వందమంది పైగా రైతులు ఎరువుల కోసం చాలాసేపు నిరీక్షించారు. అయితే ఎంతసేపటికీ ఎరువులు అందించపోవడంతో వారు ఆగ్రహానికి గురై ఆందోళనకు దిగారు. పలువురు మాట్లాడుతూ.. సరైన సమయంలో ఎరువులు అందించకపోతే పంటల సాగు ఎలా చేపట్టాలంటూ మండిపడ్డారు. వెంటనే ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. దీంతో సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ హనుమంతరాయుడు అందరికీ సకాలంలో ఎరువులు అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం గోదాములో 280 బస్తాల యూరియా సిద్ధంగా ఉందని, మరో వారంరోజుల్లో కాంప్లెక్స్ ఎరువులు కూడా తెప్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.



ఆందోళన చేస్తున్న రైతులు

రోడ్డు విస్తరణపై వెనక్కు తగ్గం

● ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

పామిడి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీసీ రోడ్డు విస్తరణలో వెనుకడుగు వేసేదేలేదని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. గుత్తిరోడ్డులోని విద్యుత్ కార్యాలయం నుంచి ప్రభుత్వాసుపత్రి వరకూ రోడ్డుకు ఇరువైపులా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ సోమవారం పాదయాత్ర నిర్వహించారు. పట్టణానికి ఎంతో అవసరమైన బీసీసీ రోడ్డు విస్తరణలో రాజకీయంగా తనకు నష్టం వాటిల్లినా.. భరించేందుకు సిద్ధమేనని అన్నారు. నిరుపేదలందరికీ ఆర్అండ్‌బీ స్థలంలో మూడు సెంట్ల ఇళ్ల స్థలాన్ని కేటాయించి, ఇళ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రోడ్డు విస్తరణతో వ్యాపారాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఆయన సూచించారు. పట్టణంలో ప్రభుత్వ అతిథి గృహం నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించి, డంప్ యార్డును తలపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి..

పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే అన్నారు. పోలీసు స్టేషన్ వద్ద పెద్దకాలువ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఖాళీ స్థలంలో కూరగాయల తోపుడు బండ్లు పెట్టించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. యూని



పామిడిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తదితరులు

యన్ బ్యాంక్ వద్ద పెద్దకాలువ అభివృద్ధి పనులు చేపట్టి ఒకవైపు డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధరమూర్తి, ఎంపీడీఓ తేజోత్స్న, ఆర్అండ్‌బీ డీఈ సత్యనారాయణ, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌చౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, టీడీపీ మండల కన్వీనర్ మునలిరెడ్డి, పట్టణాధ్యక్షుడు బొమ్మా మోహన్‌కృష్ణ, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అమ్మా.. వైద్య సేవలు ఎలా ఉన్నాయ్..?

పామిడి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణస్వీకారోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఇందుకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హాజరయ్యారు. అందులో భాగంగా ఆస్పత్రి పరిశీలించారు. ఓ గదిలో ఉన్న బాలింత రాణిని ఆయన పలకరించారు. అమ్మా.. ఆసుపత్రిలో వైద్య సేవలు ఎలా ఉన్నాయ్ అంటూ ఆరా తీయగా.. మెరుగైన వైద్య సేవలందుతున్నాయి సార్.. అంటూ ఆమె బదులిచ్చారు. తర్వాత నేనెవరో మీకు తెలుసా అని అడగ్గా... మీరు ఎమ్మెల్యే సార్ అని బాలింత సమాధానమిచ్చారు. అనంతరం ఆయన చిన్నారికి డ్రస్సు కొనియ్యండంటూ ఆ తల్లికి డబ్బులు అందజేశారు. ఇలానే మరో బాలింతతోనూ సంభాషించి డబ్బులు అందజేశారు.



చిన్నారి డ్రస్సు కోసం బాలింతకు డబ్బు ఇస్తున్న ఎమ్మెల్యే జయరాం

ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆస్పత్రిలో నిర్వహించిన డెవలప్‌మెంట్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. సభ్యులుగా ఎంపీడీఓ తేజోత్స్న, ఈఓ గోపాల్, చిలకల రాజగోపాల్, లక్ష్మీదేవి, శ్యామలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఇక్కడ ఏమేమి అవసరమవుతాయో ఉన్నతాధికారులతో చర్చించి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పామిడి మండల అభివృద్ధికి ఎవరైనా అడ్డు తగిలిగే సహించేది లేదని హెచ్చరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరైన తాగునీటి పథకాలను పూర్తిచేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పట్టణంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, టెక్స్‌టైల్స్ పార్కు అభ్యున్నతి, పెన్నానదిలో సబ్‌సర్ఫేస్ డ్యాం నిర్మాణానికి పాటు పాటుపడతానని అన్నారు. అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఎవరైనా సమస్యలు సృష్టిస్తే సహించేదిలేదని అన్నారు.

కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటన



పట్టణంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బండామసీదువీధి, రజకవీధి, చిన్నబజారులో సోమవారం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ కాలనీల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్‌లైట్లు వెలగడం లేదని, డ్రైనేజీ సమస్య, తాగునీటి సమస్యలు ఉన్నాయని, దీంతో ఇబ్బంది పడుతున్నాని కొందరు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే డ్రైనేజీ సమస్యపై మున్సిపల్ అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే వీధిలైట్లను కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఛాంబర్‌కు ఉన్న మ్యాన్యువల్ అక్కడక్కడ పగిలిపోవడంతో అధికారులకు చెప్పి తక్షణం వేయించారు. అనంతరం వార్డుల్లోని ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు, నాయకులు అబ్దుల్‌రహీం, విజయ్‌కుమార్, నియాజ్, ముస్తాక్, ఖాదర్, రజాక్, అయూబ్, ఆదిశేషయ్య తదితరులు ఉన్నారు.

భూముల రీసర్వే ప్రారంభం

రాయదుర్గం రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే భూరీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ నాగరాజు కోరారు. మండలంలోని జుంజురంపల్లిలో రీసర్వేను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 8,177.23 ఎకరాల భూమి ఉందన్నారు. వాటిలో సర్వే చేసేందుకు మూడు టీంలను ఏర్పాటు చేశామన్నారు. రోజుకు ఒక టీం 20 నుంచి 25 ఎకరాల వరకు సర్వే చేస్తారన్నారు. 120 రోజల పాటు రీసర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు. రీసర్వేపై రైతులు అపోహలు మాని సహకరించాలని సూచించారు. మండల సర్వేయర్ మణికాంత్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటరాముడు, వీఆర్వోలు పాల్గొన్నారు.



శెట్టూరు మండలం లక్ష్మంపల్లిలో భూ రీసర్వే ప్రారంభిస్తున్న అధికారులు

బెళుగుప్ప: మండలంలోని తగ్గుపర్తి గ్రామంలో తహసీల్దార్ షర్మిల, టీడీపీ నాయకులు రాధాకృష్ణ, వెంకటనాయుడు, వీఆర్వో ప్రదీప్, సర్వేయర్ శ్రీధర్ కలిసి భూ రీసర్వే ప్రారంభించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో 1226 ఎకరాలు వుండగా నాలుగు బృందాలను నియమించి సర్వే చేస్తున్నామన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

శెట్టూరు: మండలంలోని లక్ష్మంపల్లిలో రీసర్వే ప్రారంభించినట్లు తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి తెలిపారు. ఈ సర్వే పకడ్బందీగా చేయడానికి రెవెన్యూ యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేసిందన్నారు. జీపీఎస్ సిస్టమ్ ద్వారా నాలుగు బృందాలు నాలుగు నెలలపాటు సర్వే కొనసాగిస్తారన్నారు. గ్రామంలో 7137 ఎకరాలు భూమిని సర్వే చేయనున్నట్లు చెప్పారు. మండల సర్వేయర్ మున్వర్ బాషా, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ఉరవకొండ: మండలంలోని వ్యాసాపురంలో భూముల రీసర్వేను ప్రారంభించారు. మండల సర్వేయర్ రత్నాకర్, రీసర్వే డీటీ పవన్, సర్పంచ్ సీతారాములు గ్రామస్థుల సమక్షంలో రీసర్వే ప్రారంభించారు. గ్రామంలో 2618.85ఎకరాల భూమిలో రీసర్వే చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రామకృష్ణ, వీఆర్వో భాస్కర్ పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండల కేంద్రంలో రెవెన్యూ అధికారులు భూ రీసర్వేను ప్రారంభించారు. డిప్యూటీ తహసీల్దార్ రఘు నేతృత్వంలో వీఆర్వోలు, సర్వేయర్లు మూడు బృందాలుగా ఏర్పడి ఒక్కరోజులోనే 80 ఎకరాలు రీసర్వే చేపట్టారు. విడతల వారీగా అన్ని గ్రామాలలో భూముల రీసర్వే చేయనున్నట్లు వారు తెలిపారు.

బ్రహ్మసముద్రం : మండలంలోని గుండిగానెపల్లిలో తహసీల్దార్ సుమతి భూముల రీసర్వేన ప్రారంభించారు. ఆర్‌ఐ నాగిరెడ్డి, మండల సర్వేయర్ సుకన్య, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపునకు ఇంటింటి సర్వే

యాడికి, జనవరి20(ఆంధ్రజ్యోతి): జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలోని పీహెచ్‌సీ పరిధిలో గల గ్రామాల్లో సోమవారం కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపునకు వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. ఫిబ్రవరి 2వరకు సర్వే ఉంటుందని వైద్యుడు పరమేశ్వర్ తెలిపారు. కుష్ఠును క్రమం తప్పకుండా మందులు వాడడం వల్ల నయం చేయవచ్చని తెలిపారు. అనంతరం కుష్ఠు లక్షణాలున్న పలువురిని పరీక్షించారు. కార్యక్రమంలో డిప్యూడి పారా మెడికల్ ఆఫీసర్ రామచంద్ర, హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్‌గౌడ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

శెట్టూరు: మండలంలోని కుష్ఠువ్యాధిగ్రస్తులను గుర్తింపునకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు మండలకేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యాధికారి తరుణ్‌సాయి తెలిపారు. వైద్య సిబ్బందితో ఇప్పుడు ప్రారంభమైన సర్వే ఫిబ్రవరి 2వ తేదీ వరకు కొనసాగుతుందని అన్నారు. సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

గుత్తి: మున్సిపల్ పరిధిలోని చెట్నేపల్లిలో కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపునకు ఇంటింటి సర్వే చేపట్టినట్లు మెడికల్ అధికారి అమర్నాథ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రారంభమైన సర్వే ఫిబ్రవరి 2వ వరకు కొనసాగుతుందన్నారు. ఇందులో కుష్ఠు ఉన్నవారిని గుర్తించి వ్యాధిని నయం చేస్తామన్నారు. కుష్ఠు నిర్మూలన డివిజనల్ అధికారి వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వివాదంలో మహిళలపై దాడి

● పోలీసులకు ఫిర్యాదు

కూడేరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మూరులో ఇంటి వివాదంలో తమపై దాడి జరిగిందని వెంకటస్వామి, అతడి కుమార్తెలు గంగావతి, సాయి రూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ రాజు తెలిపారు. కమ్మూరులో వెంకటస్వామి అప్పటి కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్నాడు. అయితే ఇటీవల ఆ ఇంటి స్థలం మాదేనంటూ అదే గ్రామానికి చెందిన లింగారెడ్డి, అతడి కుమారుడు అశ్వర్థరెడ్డి దౌర్జన్యం చేసి ఇంటికి తాళం వేశారు. దీంతో సోమవారం వెంకటస్వామితో పాటు కుమార్తెలు ఆ ఇంటి వద్దకు వెళ్లి లింగారెడ్డిని నిలదీశారు. దీంతో ఆయన, కుమారుడు కలిసి వారిపై దాడి చేశారు. ఈ ఇంటి జోలికి వస్తే చంపుతామని బెదిరించారు. ఈ మేరకు బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు. లింగారెడ్డి, అశ్వర్థరెడ్డి ఇద్దరూ వైసీపీకి చెందిన వారని బాధితులు చెప్పారన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

బొమ్మనహాళ్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళ్లదేవనహళ్లి గ్రామ సమీపంలో గల వేదావతి హగరి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. తార్కాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు దర్గన్న ఏపీ 39 ఎన్ ఆర్ 6376 అనే నంబర్ గల ట్రాక్టర్‌లో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందించడంతో వెంటనే వెళ్లి పట్టుకుని సీజ్ చేసినట్లు చెప్పారు. తర్వాత దర్గన్నతో పాటు డ్రైవర్ ప్రకాష్‌పై కేసు నమోదు చేశామని అన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు గ్రామ సమీపంలో సోమవారం పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. గ్రామ సమీపాన కంపచెట్లలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో వెంటనే సిబ్బందితో వెళ్లి దాడులు చేశామన్నారు. అక్కడ పేకాటాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.24200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు.

హత్య కేసులో నిందితుడు..

రాయదుర్గం రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చదం గ్రామంలో పొలంగట్టు వివాదంలో గంగాధర్‌ను హత్య చేసిన కేసులో నాలుగో నిందితుడు చిన్నగంగప్పను అరెస్టు చేసినట్లు సీఐ జయనాయక్ సోమవారం ప్రకటనలో తెలిపారు. చదం గ్రామానికి చెందిన హరిజన దొణప్ప అన్నదమ్ములు ముగ్గురితో పాటు చిన్నగంగప్ప కలిసి గత డిసెంబరు 10వ తేదీన పొలం వివాదంలో గంగాధర్‌తో గొడవపడి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో అతను అదే నెల11న బళ్లారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ కేసులో ఆ అన్నదమ్ములు ముగ్గురినీ అప్పుడే అరెస్టు చేశామని, ఇప్పుడు పట్టణ సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఆర్చ్ వద్ద చిన్నగంగప్పను అరెస్టు చేశామని, ఇతడిని చేసి కోర్టులో హాజరు పరచనున్నామని సీఐ చెప్పారు.

ఇసుక రీచ్ ప్రారంభం

కణేకల్లు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి గ్రామం వద్ద ఇసుకరీచ్‌ను సోమవారం ప్రారంభించారు. జిల్లాకు చెందిన శ్రీహరి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో తొమ్మిది వేల మెట్రిక్ టన్నుల ఇసుకను విక్రయించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు నిర్వాహకుడు జయచంద్ర తెలిపారు. సర్పంచ్ రుద్రముని తదితరులు పాల్గొన్నారు.

పత్తిసాగుపై అవగాహన

పెద్దవడుగూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పత్తిపంట సాగుపై కృషివిజ్ఞానకేంద్రం డాక్టర్ కిషోర్ రైతులకు అవగాహన కల్పించారు. రైతులు క్రిమిసంహారక మందులను తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. సస్యరక్షణ చర్యలు చేపట్టి పత్తిలో అధిక దిగుబడులు సాధించాలని తెలిపారు. వ్యవసాయ అధికారి మల్లేశ్వరి, ఏఈఓ సునీత, రైతు సేవ కేంద్రం అధికారి జయలక్ష్మి, ఎంపీఈఓ శిరీష, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించాలి: విప్ కాలవ

రాయదుర్గం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పొందిన కోచింగ్ అభ్యర్థులంతా మెగా డీఎస్సీ పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపి ఉద్యోగం సాధించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆకాంక్షించారు. టెట్, డీఎస్సీ అభ్యర్థులకు పట్టణంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గత 116 రోజులుగా జరిగిన ఉచిత శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. రాయదుర్గం పరిసర ప్రాంతాలకు చెందిన 260 మంది అభ్యర్థులు ఈ తరగతులకు హాజరై నిపుణుల పర్యవేక్షణలో శిక్షణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో కాలవ హాజరై మాట్లాడారు. రాయదుర్గం లాంటి వెనుకబడిన ప్రాంతంలో దూర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకోవడం వ్యయ ప్రయాసాలతో కూడుకున్న విషయమన్నారు. అందుకే ఈ ప్రాంతంలోని అభ్యర్థుల సౌకర్యార్థం పట్టణంలో ఉచిత కోచింగ్ ఏర్పాటు చేయించామని అన్నారు. శిక్షణకు హాజరై విజయవంతం చేసిన అభ్యర్థులను పేరు పేరునా అభినందించారు. ఇప్పటి వరకు ఎంత క్రమశిక్షణతో శిక్షణ పొందారో పోటీ పరీక్షలు పూర్తి అయ్యే వరకు అదే ఉత్సాహం కొనసాగించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఉద్యోగం పొందాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం వారికి శిక్షణ పొందిన సర్టిఫికెట్లను, ఫైళ్లను అందించారు.



ఫైళ్లను పంపిణీ చేస్తున్న కాలవ శ్రీనివాసులు

మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసి పని చేద్దాం

కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ కలిసి పనిచేద్దామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో రూ. 12 కోట్ల బడ్జెట్‌ను వైసీపీ కౌన్సిలర్లు ఆమోదించని విషయాన్ని గుర్తు చేసి.. అందరూ సహకరిస్తేనే మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అభివృద్ధికి సమష్టి కృషి ఎంతో అవసరమని కోరగా.. కౌన్సిలర్లు బడ్జెట్ ఆమోదానికి ఓకే తెలిపారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మున్సిపల్ సమావేశాల్లో ఒక్క రోజు కూడా చైర్మన్‌కు కుర్చీ కూడా వేయకుండా ఇబ్బంది పెట్టారని, కానీ మేము అలా కాదని, కుర్చీవేసి గౌరవిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం కౌన్సిలర్లు తమ పరిధిలో ఉన్న సమస్యలను ప్రస్తావించగా.. ప్రతి రోజు వార్డుల వారీగా తిరిగి పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా జాగ్రత్త పడాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. మున్సిపల్ కార్యాలయ భవనం, మున్సిపల్ కాంప్లెక్స్ భవనం, కూరగాయల మార్కెట్, పూల మార్కెట్, చికెన్, మటన్, ఫిష్ మార్కెట్ల ఏర్పాటుకు, డంపింగ్ యార్డు ఏర్పాటుకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించామని అన్నారు. దీంతో పాటు వీధిలైట్లు, సీసీ రోడ్లు, ప్రధాన రహదారి, ఇంటర్నల్ రహదారుల ఏర్పాటు కోసం ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అలాగే ఇంటింటికీ కొళాయి పథకాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో.. ఆ పథకం పునరుద్ధరణకు ప్రణాళికలు పంపామని తెలిపారు. పట్టణంలో తాగునీటి అవసరాల కోసం వాటర్ స్టోరేజ్ పాయింట్ కోసం కూడా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. సమావేశంలో మున్సిపల్ సిబ్బంది, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని

కేదారనాథ్ స్వామి ఆశీస్సులు తీసుకున్న ఎమ్మెల్యే.

బ్రహ్మసముద్రం: మండలంలోని ముప్పులకుంట గ్రామంలో గల శాంత లింగేశ్వరస్వామి తపోక్షేత్రంలో 26వ అనుష్టానోత్సవంను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కేదారనాథ్ ఆస్థానస్వామి డాక్టర్ నాల్వడి శాంతలింగ శివాచార్యులు హాజరయ్యారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కేదారనాథ్ స్వామి ఆశీర్వాదం పొందారు. జడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి, టీడీపీ మండల అధ్యక్షులు శ్రీరాములు తదితరులు ఉన్నారు.

జయంతి ఉత్సవాలకు జేసీపీఆర్‌కు ఆహ్వానం

తాడిపత్రి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఫిబ్రవరి 1వ తేదీన జరిగే మార్కండేయస్వామి జయంతి వేడుకలకు స్థానిక మున్సిపల్ కా ర్యాలయంలో సోమవారం చై ర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిని మా ర్కండేయస్వామి ఆలయ కమి టీ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తాడిపత్రిలోని ఆలయాలను అభివృద్ధి చేయాలని అన్నారు. ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. ఏప్రిల్‌లో జరగబోయే భద్రావతి భావనా రుషీశ్వరుల కల్యాణోత్సవాన్ని, తిరుణాలను అందరం కలిసి విజయవం తం చేద్దామని పిలుపునిచ్చారు. చైర్మన్‌ను కలిసిన వారిలో జలదుర్గం దామోదర్, రాజగోపాల్, సతీష్, రాజా, రమేష్‌బాబు, ఓబులేసు తదితరులు ఉన్నారు.



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న జేసీపీఆర్

గ్రామాల్లో పశువైద్యశిబిరాలు

రాయదుర్గం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పశువుల ఆరోగ్యం కోసం గ్రామాల్లో ప్రభుత్వం గ్రామాల్లో ఉచిత పశువైద్యశిబిరాలను నిర్వహిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. మండలంలోని మల్కాపురం, వజ్రవన్నూరు గ్రామాల్లో సోమవారం ఆయన పశువైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. అందులో పశువులకు వివిధ చికిత్సలు చేశారు. గాలికుంటవ్యాధి నివారణ టీకాలు , నట్టల నివారణ మందులను అందించారు. గొర్రెలకు బొబ్బవ్యాధి నివారణ టీకాలు వేశామని పశువైద్యాధికారి తెలిపారు. సర్పంచ్ అశోక్, గ్రామస్థులు, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.



బెళుగుప్ప మండలం అంకంపల్లిలో జీవాలకు టీకాలు వేస్తున్న వైద్యులు

గుమ్మఘట్ట: మండలంలోని మారెంపల్లి, దేవరెడ్డిపల్లి గ్రామాల్లో పశువైద్యాధికారి నవీన్ ఉచిత పశువైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. పశువైద్య టీం లీడర్ దివ్యభారతి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుందుర్పి: మండల కేంద్రంలో సర్పంచ్ మారుతేశ్వరి, పశువైద్యుడు డాక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలు ఏర్పాటయ్యాయి. కరిగానపల్లి గ్రామంలోనూ పశువైద్యశిబిరాన్ని నిర్వహించినట్లు పశువైద్యుడు తెలిపారు. టీడీపీ నాయకులు పెద్ద నరసింహప్ప, మల్లికార్జున, రామ్మూర్తి, శేషాద్రి, కరిగానపల్లి సర్పంచ్ నాగేంద్ర, మాజీ సర్పంచ్ చిత్రలింగప్ప, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బెళుగుప్ప:మండలంలోని అంకంపల్లి, కోనంపల్లి గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. పశు వైద్యుడు రమేష్, టీడీపీ నాయకులు నరేంద్ర చౌదరి, కిష్టప్ప, శ్రీనివాసులు, ఈశ్వరయ్య, మారుతి, పశువైద్య సిబ్బంది రవి పాల్గొన్నారు.

కూడేరు: మండలకేంద్రంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి నట్టల నివారణ మందులు అందజేసినట్లు పశువైద్యుడు శ్రీనివాసులు తెలిపారు. టీడీపీ నాయకులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విడపనకల్లు: మండల కేంద్రంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని పశువైద్యాధికారి నరేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్ చంద్రశేఖర్, టీడీపీ నాయకులు రామాంజనేయులు, హనుమంతు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.